ప్రజాశక్తి
శుక్రవారం 12 సెప్టెంబర్ 2025 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

కలెక్టర్ల బదిలీ

- రెండో ఏడాదిలో ప్రభుత్వ నిర్ణయం
- ప్రకాశం కలెక్టర్‌గా రాజాబాబు..
- బాపట్ల కలెక్టర్‌గా వినోద్‌బాబు



రాజాబాబు



వినోద్‌బాబు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో, బాపట్ల జిల్లా

ప్రభుత్వం గురువారం నాడు రాష్ట్రంలో పలు జిల్లాల కలెక్టర్లను ఆకస్మికంగా బదిలీ చేసింది. ఇందులో ప్రకాశం, బాపట్ల జిల్లాల కలెక్టర్లు ఇద్దరూ బదిలీ అయ్యారు. ఏడాది పాలన ముగిశాక కూటమి పెద్దలు పాలన తీరుపై తర్జనభర్జనలు పడుతున్నారు. పాలనలో వేగం లేదనే చర్చ నడుస్తోన్న తరుణంలో కలెక్టర్లను బదిలీ చేయడం అధికార వర్గాల్లో చర్చగా మారింది. రాజకీయ సమన్వయం, సమర్ధత, ఆరోపణలు వంటివి బదిలీలకు కారణాలుగా భావిస్తున్నారు. మంత్రులతో పాటు ఎమ్మెల్యేలతో సమన్వయ లోపాలు, ఎమ్మెల్యేల సిఫార్సులకు ప్రాధాన్యత ఇచ్చే అంశాలు వంటివి బదిలీలకు దారితీశాయని సమాచారం. ఎవరు పనితీరు ఎలా ఉందో నేతల మధ్య చర్చ సాగుతోంది. ప్రజాప్రతినిధుల అభిప్రాయాల మేరకు మార్పులు చేర్పులు జరిగాయని తెలుస్తోంది. పాలనలో ఆశించిన వేగం పెరగకపోవడానికి కలెక్టర్ల పాత్ర కూడా కారణంగా ప్రభుత్వం అంచనా వేసినట్లు సమాచారం. ఏదేమైనా కొత్త కలెక్టర్లను నియమించారు. ప్రకాశం కలెక్టర్ అన్సారియాను గుంటూరు జిల్లాకు బదిలీ చేశారు. రాజాబాబును ప్రకాశం జిల్లాకు కలెక్టర్‌గా నియమించారు. బాపట్ల కలెక్టర్ వెంకట మురళిని బదిలీ చేశారు. ఇక్కడకు వినోద్ కుమార్‌ను నియమించారు. బాపట్ల కలెక్టర్‌గా రానున్న డాక్టర్ వి.వినోద్‌కుమార్ 2015 బ్యాచ్‌కు చెందిన ఐఎఎస్ అధికారి. ఏపీ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఎండిగా, రంపచోడవరం సబ్ కలెక్టర్‌గా, ▶ 2లో

రెండు పాలకపక్షాల మధ్య
సమన్వయం ఉంటుందా.?

- సీజనల్ సమస్యల నడుమ నేడు జడ్పీ సమావేశం
- పైచేయి సాధించేందుకు కూటమి ప్రతినిధుల వ్యూహం



ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

జడ్పీ పాలకపక్షం వైసిపి ఆధీనంలో ఉండగా.. యంత్రాంగం కూటమి ఆధీనంలో ఉంది. ఇప్పుడు జడ్పీలో ఊహించని రాజకీయ పరిణామాలే కనిపిస్తున్నాయి. ఎత్తుకుపై ఎత్తులు.. వ్యూహాలకు ప్రతివ్యూహాలు నడుస్తున్నాయి. అధికారం కీలకంగా మారింది. చట్ట రీత్యా సర్వాధికారాలు జడ్పీ పాలకపక్షానికి ఉన్నాయి. కూటమి నుంచి సభ్యులుగా ఉన్న మంత్రులు, ఎమ్మెల్యేలదే ఇప్పుడు పైచేయిగా ఉన్నా జడ్పీ తీర్మానాలను కాదని.. అక్కడ చేయగలిగిందేమీ లేదు. ఈ పరిస్థితుల్లో శుక్రవారం నాడు జరగనున్న జడ్పీ సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది. సాధారణ అంశాలే ఎజెండాలో పెట్టారు. దీనికి సభ్యులుగా ఉన్న జడ్పీటీసీలు, ఎంపీపీలు వైసిపి నుంచి హాజరుకానున్నారు. ఇక మంత్రులు, ఎమ్మెల్యేలు కూటమి నుంచి గెలిచిన సంగతి తెలిసిందే. వీళ్లూ సభ్యులుగా ఉన్నారు. అధికారం మారాక ఇక్కడ పరిస్థితులూ మారిపోయాయి. జడ్పీ పాలకపక్షం సమస్యలపైనే ఎక్కువగా చర్చకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ చర్చల్లో నుంచే ప్రభుత్వంపై విమర్శలు, రాజకీయ దాడికి అవకాశం దొరికినప్పుడల్లా ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైసిపి అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి జడ్పీలో వివాదాస్పద అంశాలకు ప్రాధాన్యత ఇవ్వకుండా లాక్కొస్తున్నారు. సమస్యలపై చర్చ.. మంత్రుల సమాధానాలు వంటి అంశాలకే పరిమితమవుతున్నారు. మిగతా వైసిపి సభ్యులు కొందరు గత సమావేశాల్లో వాడివేడిగా మాట్లాడటంతో పాటు ప్రోటోకాల్ వంటి అంశాలపై దుమారం రేపారు. దీంతో అప్పటి నుంచీ మంత్రులు, ఎమ్మెల్యేలు సమావేశంపై తర్జనభర్జన పడ్డారు. హాజరుపై ఆసక్తిగా లేరు. అరకొరగానే వస్తున్నారు. రెండు పార్టీల నడుమ పరిస్థితులు ఇలా ఉన్నాయి. ఈ నేపథ్యంలో జరుగుతున్న శుక్రవారం నాటి జడ్పీ సమావేశానికి మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరవుతారా? లేదా? అనేదీ చూడాలి. అధికారులు ఎజెండాను ఎమ్మెల్యేలకు, సభ్యులకు పంపారు. ఇక్కడ ఎలాంటి చర్చలుంటాయన్నదీ చూడాలి. జనం సమస్యలపై చర్చ సాగుతుందా? లేదా.? అనేదీ ఆలోచించాలి. ప్రస్తుతం ▶ 2లో

పర్యావరణ పరిరక్షణ
మనందరి బాధ్యత

- చెట్లను, జీవరాశులను మనం కాపాడుకోవాలి..
- అటవీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే
- బాపట్ల, నగర వనంలో జాతీయ అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవ సభ



మాట్లాడుతున్న అటవీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

పర్యావరణ పరిరక్షణతో పాటు చెట్లు, సమస్త జీవరాశులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అటవీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే పేర్కొన్నారు. బాపట్ల మండలం, నగరవనంలో గురువారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం-అటవీ శాఖ ఆధ్వర్యంలో జాతీయ అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో కాంతిలాల్ దండే ముఖ్యఅతిథిగా మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణ, చెట్లు, జంతువులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలిపారు. ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 11న జాతీయ అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవం జరుపుకుంటామన్నారు. అటవీ సంరక్షణలో భాగంగా రాష్ట్రంలో రెడ్ శాండిల్ అటవీ ఉత్పత్తుల రక్షణలో విధులు నిర్వహిస్తూ మరణించిన వారి స్మృతులను స్మరించుకోవడం జరుగుతుందన్నారు. అటవీ శాఖలో సిబ్బంది విధి నిర్వహణలో ప్రాణాలకు కోల్పోవడంతో వారి కుటుంబాలకు అటవీ శాఖ సపోర్టుగా ఉండాలన్నారు. కుటుంబ సభ్యులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. అటవీ శాఖలో పని చేస్తూ విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన వారి సేవలను గుర్తు చేసుకుంటూ వారి ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలన్నారు.

బాపట్ల ఎంపీ టి.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ 35 సంవత్సరాల పాటు యూనిఫాం ధరించి ఐపిఎస్‌గా పనిచేసిన సమయంలో తెలంగాణాలో తన మిత్రుడు నక్సల్స్ చేతిలో మరణించడం తన కళ్లారా చూడడం జరిగిందన్నారు. అటవీ సంరక్షణలో విధులు నిర్వర్తిస్తూ పలువురు మరణించడం చాలా బాధాకరమైన విషయమన్నారు. వారి సేవలను గుర్తెరిగి, వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని, కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పేర్కొన్నారు.

కలెక్టర్ జె.వెంకటమురళి మాట్లాడుతూ కొందరు అజ్ఞానంతో గ్రామాలలో చెట్లను నరికివేయడంతో పర్యావరణానికి హాని కలిగిస్తున్నారని, దాని ఫలితంగా వాతావరణంలో అనేక మార్పులు రావడం జరుగుతుందన్నారు. చెట్లను, జంతువులను కాపాడి రాబోయే తరాలకు అనుకూలమైన వాతావరణాన్ని తమ పిల్లలకి అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అటవీ శాఖలో విధులు నిర్వహిస్తూ మరణించిన 8 కుటుంబాలకు చెందిన సభ్యులను ▶ 2లో



మాట్లాడుతున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

మెడికల్ కాలేజీల నిర్మాణం
పీపీపీ పద్ధతిలో తగదు..

- మార్కాపురం మెడికల్ కాలేజీని ప్రభుత్వమే నిర్మించాలి
- ఆరోగ్యశ్రీని యథాతథంగా నిర్వహించాలి
- వైసిపి జిల్లా అధ్యక్షులు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

వైసిపి ప్రభుత్వం నిర్మాణం చేపట్టిన మెడికల్ కాలేజీలను పీపీపీ పద్ధతిన ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించే చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు వైసిపి జిల్లా అధ్యక్షులు దర్శి శాసనసభ్యులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి ప్రకటించారు. గురువారం సాయంత్రం ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో జిల్లాపరిషత్ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఒంగోలు పార్లమెంట్ పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, ఒంగోలు నియోజకవర్గ సమన్వయకర్త చుండూరు రవి బాబు, మార్కాపురం నియోజకవర్గ సమన్వయకర్త అన్నా వెంకటరాంబాబుతో కలిసి మాట్లాడారు. 2019–24 కోవిడ్ మహమ్మారి విజృంభించిన కాలంలో పేదలందరికీ ప్రభుత్వ వైద్యసేవలు, వైద్య విద్య అందించే దిశగా 17 మెడికల్ కాలేజీలు మంజూరు చేయించారని ప్రస్తావించారు. వాటిలో 5 కాలేజీలు ప్రారంభం కాగా పాడేరు, పులివెందుల కాలేజీలు నిర్మాణం పూర్తయినట్లు తెలిపారు. మిగిలిన పది కాలేజీలు వివిధ దశల్లో నిర్మాణం జరిగే క్రమంలో ఎన్నికల కోడ్ వల్ల పనులు నిలిచిపోయాయని గుర్తుచేశారు. రాష్ట్ర కేబినెట్ సమావేశమై ఇటీవల మిగిలిన పది కాలేజీలు నిర్మాణం ప్రారంభం కాలేదని, వాటిని పీపీపీ పద్ధతిలో ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించనున్నట్లు ప్రకటించి, నిర్ణయాలు చేయడం పట్ల తీవ్ర ఆక్షేపణ వ్యక్తం చేశారు. మార్కాపురం మెడికల్ కాలేజీ భవన నిర్మాణం పూర్తి గావచ్చినట్లు వివరించారు. కాలేజీకి బోధనకు కావలసిన ప్రొఫెసర్లు, అసోసియేట్లను ▶ 2లో

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

(మొదటిపేజీ తరువాయి)

ఈ సందర్భంగా సన్మానించారు. కార్యక్రమంలో భాగంగా నగరవనంలో జాతీయ అటవీ అమరవీరుల గుర్తుగా ఏర్పాటు చేసిన స్తూపాన్ని అటవీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, కలెక్టర్, అటవీ శాఖ అధికారులు కలిసి ప్రారంభించి.. అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ సలహాదారులు మల్లిఖార్జున, అటవీ శాఖ అధికారులు పి.వి.చలపతి, రాహుల్ పాండే, శాంతిప్రియ పాంటే, శరవణన్, ఐ.కె.వి.రాజు, చైతన్యకుమార్‌రెడ్డి, ఎస్పీ తుషార్‌డూడి, కె.వినోద్‌కుమార్, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల నిర్మాణం పీపీపీ పద్ధతిలో తగదు..

(మొదటిపేజీ తరువాయి)

నియమించినట్లు గుర్తు చేశారు. వైఎస్ వైద్యునిగా తెలుగు రాష్ట్రాల్లో ఏకకాలంలో అధిక సంఖ్యలో ప్రభుత్వ మెడికల్ కాలేజీలు రూపొందించగా, ఆయన ఆశయాల కోసం జగన్‌మోహన్‌రెడ్డి ఏక కాలంలో 17 కాలేజీలు మంజూరు చేయించిన ఘనత దక్కుతుందన్నారు. వైఎస్ హయాంలో ఒంగోలులో రిమ్స్ మెడికల్ కాలేజీ రూపు దిద్దుకున్నట్లు గుర్తు చేశారు. మార్కాపురంలో పనులే ప్రారంభించలేదని వక్రీకరించడం తగదని హితవు పలికారు. రాష్ట్రవ్యాప్తంగా అయిదారు వేలకోట్లు వెచ్చిస్తే నిర్మాణం పూర్తి అవుతుందన్నారు.

పద్నాలుగు నెలల కాలంలో రూ.2 లక్షలు కోట్లు అప్పు తెచ్చిన చంద్రబాబు ఆరేడు వేల కోట్ల ఖర్చయ్యే మెడికల్ కాలేజీలు నిర్మించలేరా.? అని ప్రశ్నించారు. రాజధాని పేరుతో చిల్ల చెట్లు, మురుగునీరు మళ్లించడానికి రూ.60 వేల కోట్లు టెండర్ వేసిన చంద్రబాబు కాలేజీలు ఎందుకు పూర్తి చేయలేకపోతున్నారని ప్రశ్నించారు. పీపీపీ పద్ధతిన మెడికల్ కాలేజీలు ఏర్పడితే ఫ్రీ మెడికల్ సీట్లు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. వైద్యసేవలకు పేదవారు డబ్బు చెల్లించవలసి వస్తుందన్నారు. తన అనుయాయులకు కాలేజీలు అప్పగించే కుట్రలో భాగంగా ఈ చర్యలు చేపట్టినట్లు దునుమాడారు.

పేదవానికి ఆధునిక వైద్యం అందించే లక్ష్యంగా రూపొందించిన ఆరోగ్యశ్రీ పథకాన్ని ఇన్సూరెన్స్ కంపెనీలకు కట్టబెట్టే యోచనను కూటమి ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఏడాదికి రూ.3600 కోట్ల వ్యయం అయ్యే ఈ పథకం రూ.8 వేల కోట్లు వ్యయం అయ్యే ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించడం శోచనీయమన్నారు. 14 నేలల్లో నెట్ వర్క్ హాస్పిటల్స్‌కు చెల్లించవలసిన రూ.4500 కోట్లకు కేవలం రూ.600 కోట్లు చెల్లించిన చంద్రబాబు రూ.8 వేల కోట్లు ఎలా చెల్లిస్తారని ప్రశ్నించారు. ఈ పథకాన్ని పేదలకు వైద్యం అందకుండా చేసే కుట్రగా ఆరోపించారు.

కరువు జిల్లాలో వెనుక బడిన మార్కాపురం ప్రాంతం పట్ల కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని దుయ్యబట్టారు. మార్కాపురం మెడికల్ కాలేజీతో పాటు అన్ని కాలేజీలను ప్రభుత్వ కాలేజీలుగా ప్రభుత్వం నిర్మించాలని, ఆరోగ్యశ్రీ పథకం పూర్వం లాగానే యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శులు కె.వి.రమణారెడ్డి, వై.వేంకటేశ్వరరావు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పోసం మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెండు పాలకపక్షాల మధ్య సమన్వయం ఉంటుందా.?

(మొదటిపేజీ తరువాయి)

సీజనల్ సమస్యలు తీవ్రంగా ఉన్నాయి. జ్వరాలు ప్రబలుతున్నాయి. యూరియా కొరత ఉంది. పొగాకు పంటకు ప్రత్యామ్నాయంగా ఏఏ పంటలు వేసుకోవాలో వ్యవసాయశాఖ ప్రకటించాల్సి ఉంది. వ్యవసాయం, వైద్య, ఆరోగ్య శాఖ, ఇరిగేషన్, తాగునీరు, విద్యుత్ తదితర శాఖలపై చర్చ కీలకంగా ఉండనుంది.

కలెక్టర్ల బదిలీ

(మొదటిపేజీ తరువాయి)

నెల్లూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేశారు. పార్వతీపురం ట్రైబల్ వెల్ఫేర్ లో, గ్రామీణ తాగునీరు,ఎపి మైన్స్ ల్యాండ్ తదితర శాఖల్లో పని చేశారు. 2024 ఏప్రిల్ 3న అనంతపురం జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు చేపట్టారు. సాధారణ ఎన్నికలను సమర్ధవంతంగా నిర్వహించారు.



కళా ఉత్సవంలో విద్యార్థుల ఆటపాటలు

డైట్‌లో కళా ఉత్సవం ప్రారంభం

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మండలంలోని మైనంపాడు ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణ సంస్థలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కళా ఉత్సవం 2025 పోటీలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఒంగోలు, పర్చూరు డివిజన్‌ల నుంచి 39 ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల నుంచి 311 మంది విద్యార్థులు హాజరయ్యారు. కళా ఉత్సవం పోటీలతో అక్కడ పండుగ వాతావరణం నెలకొంది. ప్రారంభం రోజు 6 కళలలో 12 విభాగాలలో పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డైట్ ప్రిన్సిపాల్ సామ సుబ్బారావు అధ్యక్షత వహించగా కార్యక్రమాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి ఏ కిరణ్ కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డైట్ అధ్యాపకులు మరియు నాన్ టీచింగ్ స్టాఫ్, న్యాయ నిర్ణేతలు జిల్లాలోని రెండు డివిజన్లకు చెందిన ఉపాధ్యాయులు హాజరయ్యారు. మొదటిరోజు రెండు డివిజన్లో విద్యార్థుల నుంచి అపూర్వ స్పందన లభించిందని డైట్ ప్రిన్సిపాల్ సామ సుబ్బారావు తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి డైట్ ప్రిన్సిపాల్ సుబ్బారావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులలో ఉన్న కళలను వాళ్ళ సామర్థ్యాలను వెలికి తీసేందుకు ప్రభుత్వం ఇచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఈ కార్యక్రమానికి విచ్చేసిన విద్యార్థులను అభినందించారు. డీఈఓ ఏ కిరణ్ కుమార్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతి సాంప్రదాయాల్లో కళలు ఒక భాగం అని, విద్యార్థులలో పోటీతత్వం పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని తెలియజేశారు. 12వ తేదీ కందుకూరు, మార్కాపురం డివిజన్లకు కళా ఉత్సవ పోటీలు జరుగుతాయని, కళా ఉత్సవం నిబంధనలకు అనుగుణంగానే విద్యార్థులను ఈ పోటీలకు తీసుకురావాలని రెండు డివిజన్లలోని ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయులకు ప్రిన్సిపల్ సుబ్బారావు సూచించారు.



మాట్లాడుతున్న డిప్యూటీ డైరెక్టర్ సందీప్ కృపాకర్

అమరవీరుల త్యాగాలు మరువలేం...

ప్రజాశక్తి-మార్కాపురం

అటవీ శాఖలో అంకిత భావంతో పనిచేసిన స్మగ్లర్ల చేతిలో ఈ ప్రాంతానికి చెందిన నలుగురు సిబ్బంది అమరులయ్యారని, వారి త్యాగాలను ఎప్పటికీ మర్చిపోలేమనని మార్కాపురం అటవీ శాఖ డిప్యూటి డైరెక్టర్ సందీప్ కృపాకర్ అన్నారు. అటవీ శాఖలో అమరవీరుల సంస్మరణ దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యాలయ ఆవరణలోని అమరవీరుల స్థూపం వద్ద నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. అటవీ సిబ్బందికి స్మగ్లర్ల నుంచి ఎలా రక్షించుకోవాలో అవగాహన కల్పించారు. అడవులను కాపాడుకోవాలని, ప్రజలు కూడా సహకరించాలని కోరారు. అటవీ సిబ్బందికి సమస్య తలెత్తినా, ప్రాణ హాని ఉందని సమాచారం అందినా తనకు తెలియజేయాలన్నారు. వారికి తగిన రక్షణగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫీజులు వసూలు చేస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి-యరగొండపాలెం

మండలంలోని ప్రైవేటు పాఠశాలల్లో ఆర్టీఈ (12)1సీ చట్టం ద్వారా కేటాయించిన 25 శాతం ఉచిత ప్రవేశాలకు ఎలాంటి ఫీజులు వసూలు చేయరాదని యర్రగొండ పాలెం ఎంఈవో పి ఆంజనేయులు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు చెందిన పిల్లలకు తప్పనిసరిగా ఫీజు మినహాయింపు ఇవ్వాలని, ఎక్కడైనా ఫీజులు అడిగినట్లు తల్లిదండ్రులు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మండలంలోని ప్రైవేటు యాజమాన్య పాఠశాలల్లో ఆర్టీఈ (12)1సీ ద్వారా ఉచితంగా ప్రవేశాలు పొందిన విద్యార్థుల నుంచి స్కూల్ మెయింటెనెన్స్ ఫీజు కింద డబ్బులు వసూలు చేస్తున్నారంటూ తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించి ఫీజులు వసూలు చేసిన పాఠశాలలపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

CHANGE OF NAME

I, RACHAMALLA VENKATA NARAYANA REDDY (Old Name) S/o.LAKSHMIREDDY Residing at D.No.2-29, Cheruvukommupalem Village,K.Agraharam Post,Ponnaluru mandal, Prakasam District- 523111, Andhra Pradesh. In that passport my wife name was wrongly mentioned OBULA KUMARI RACHAMALLA(Old Name) W/o.RACHAMALLA VENKATA NARAYANA REDDY Hence after my wife name is known as RACHAMALLA OBULAMMA(New Name) W/o.RACHAMALLA VENKATA NARAYANA REDDY will be applicable for all purpose

CHANGE OF NAME

I, RACHAMALLA OBULA KUMARI (Old Name) W/o.VENKATA NARAYANA REDDY Residing at D.No.2-29,Cheruvukommupalem Village, K.Agraharam Post,Ponnaluru mandal,Prakasam District-523111, Andhra Pradesh. I Have changed my name as RACHAMALLA OBULAMMA(New Name) W/o.VENKATA NARAYANA REDDY Hence after my name is known as RACHAMALLA OBULAMMA(New Name) W/o.VENKATA NARAYANA REDDY will be applicable for all purpose

ఒంగోలు ప్రిన్సిపల్ జిల్లా జడ్జి వారి కోర్టులో
EA No : 252/2025
IN
EP No : 5/2024
IN
PLC No : 50/2014

T. శ్రీనివాసరావు ..... పిటీషనరు(DHR)
వర్సెస్
M.లక్ష్మీ ....రెస్పాండెంట్ (JDR)

To
మంగమూరి లక్ష్మి, భర్త నాగేశ్వరావు,
SR రెసిడెన్సి వెనుక, నాగరాజుపల్లిరోడ్డు
మార్టూరు, ప్రకాశం జిల్లా
ప్రస్తుతం బాపట్ల జిల్లా

యీ పిటిషనరు EP షెడ్యూలు సవరణ చేయమని కోరుచూ పిటిషన్ దాఖలు చేయగా మీ నోటీసు నిమిత్తం తే 25-09-2025 దికి వాయిదా వేసినారు కనుక వాయిదా రోజున ఉదయం 10.30 నిమిషాలకు పైకోర్టులో స్వయంగా గాని లేదా అడ్వకేట్ గారి ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలుపు కొనవలసినది. లేని యెడల మీపరోక్షమందు విచారించి తీర్మానించబడునని తెలియజేయడమైనది

// కోర్టు వారు అనుమతిన //

వాయిదా తేది : 25-09-2025
ఒంగోలు
తేది : 11-09-2025

ఇట్లు
అన్నపరెడ్డి సునీత
పిటిషనరు తరపు అడ్వకేట్
ఒంగోలు

మహారాజశ్రీ మూడవ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో, ఒంగోలు
AS No : 40/2024

Between
మున్నం వెంకటరమణమూర్తి (డైడ్) అండ్ ఇతరులు .....అప్పిలెంట్
మరియు
కల్లమ్ వెంకటసుబ్బారెడ్డి (డైడ్)ఇతరులు .... రెస్పాండెంట్లు

To
R2) కల్లమ్ హిమబిందు
తండ్రి లేటు వెంకటసుబ్బారెడ్డి,
నివాసం : అకృతిమాల్ ఎదురువీధి,చీరాల,
బాపట్ల జిల్లా.
R3) కల్లమ్ అమర్ నాథ్ రెడ్డి,
తండ్రి లేటు వెంకటసుబ్బారెడ్డి,
నివాసం : అకృతిమాల్ ఎదురువీధి,చీరాల,
బాపట్ల జిల్లా.

పై నెంబర్ గల దావాలో మీకు అనేకసార్లు నోటీసులు పంపినను మీరు తీసుకొనక జాప్యం చేస్తున్న కారణం చేత కోర్టు వారి ఉత్తర్వుల మేరకు ఈ నోటీసు ఇవ్వడమైనది. కావున మీరు వాయిదా తేది 06-10-2025న ఉదయం గం10.30 నిమిషాలకు మీరు గాని లేదా మీ తరపున ఏజెంట్ ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెయను లేనియెడల మీపరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

వాయిదా తేది : 06-10-2025

ఇట్లు
మేకల రామమూర్తి
అడ్వకేట్, ఒంగోలు

మహారాజశ్రీ మూడవ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో, ఒంగోలు
AS No : 64/2024

Between
నాగిశెట్టి రాజ్యలక్ష్మి .... అప్పిలెంట్
మరియు
అనంత వెంకయ్య మరియు ఇతరులు .... రెస్పాండెంట్లు

R4) అనంత చంద్రశేఖర్ రావు
తండ్రి వెంకయ్య, వయస్సు 44 సంవత్సరాలు,
హిందూ, నివాసం : బందరు రోడ్డు, ఒంగోలు,
ప్రకాశం జిల్లా.

పై నెంబర్ గల దావాలో మీకు అనేకసార్లు నోటీసులు పంపిననూ మీరు తీసుకొనక జాప్యం చేస్తున్న కారణం చేత కోర్టు వారి ఉత్తర్వుల మేరకు ఈ నోటీసు ఇవ్వడం అయినది కావున మీరు వాయిదా తేది 06-10-2025న ఉదయం 10.30 గంటలకు మీరు కానీ లేదా మీ తరఫున ఏజెంట్ ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెయను లేనియెడల మీపరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

వాయిదా తేది : 06-10-2025

ఇట్లు
మేకల రామమూర్తి
అడ్వకేట్, ఒంగోలు

మహారాజశ్రీ శ్రీకాకుళం జిల్లా 4వ అదనపు జిల్లా జడ్జి కం ఎస్సీ& ఎస్టీ కోర్టు శ్రీకాకుళం.
M.V.O.P No: 5/2025.

Between:
Gudivada Kaminaidu .....Petitioner
And:
Y. Ram Prasad and others ....Respondents

To,
R-2: Y. కిరణ్ కుమార్ S/o సంగయ్య డోర్ నెం:.1-150, శివాలయం దగ్గర, జోగన్నగని, కారంచెడు, ప్రకాశం జిల్లా.

NOTICE

పై నెంబరు కోర్టులో పై నెంబరు పిటిషనరు మీ పైన వేసిన నష్టపరిహారం నిమిత్తము వేసిన కేసులో మీ హాజరు నిమిత్తము **తే 29-09-2025 దీన వాయిదా అయి ఉన్నది** కావున **తే 29-09-2025 దీని ఉదయం గం॥లకు 10:30 నిమిషములకు** పై కోర్టులో మీరు స్వయంగా గాని వకీల్ ద్వారా గాని హాజరై మీకు ఆక్షేపణలు తెలియజేసుకోవలేను లేని ఎడల మీ పరోక్షమందు కేసు తీర్మానము జరుపబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

పాడి సీతన్నాయుడు
ఆడ్వకేట్,
శ్రీకాకుళం, ఫోన్: 8332967399.

నోటీసు
మహారాజశ్రీ తెనాలి సెకండ్ అడిషనల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) తెనాలి
I.A.No. /2025
IN
O.S.No. 592/2024

Between:
గోపాళం శ్రీమన్నారాయణ ......పిటీషనర్/ వాది
మరియు
సోమరౌతు శ్రీనివాస రావు .....రెస్పాండెంటు/ప్రతివాది

To:
సోమరౌతు శ్రీనివాసరావు
S/o. ధనుజయరావు,
R/o. D.No.3-65, చావలి విలెజ్,
వేమూరు మండలం, బాపట్ల జిల్లా.

పై నెంబర్ పిటీషన్‌ను రెస్పాండెంటు/ ప్రతివాది అయిన మీ పై పిటీషనర్ దాఖలు చేయగా సదరు పేటిషనులో మీకు అనేకసార్లు నోటీసులు పంపినను మీరు తీసుకోనందున ఈ పేపర్ నోటీసు ద్వారా పై కోర్ట్‌వారిఎదుట ది.17-09-2025వ తేదీన ఉదయం 10.30గం.లకు పైకోర్ట్ వారి ఎదుట మీరు స్వయంగా గానీ, మీ తరపు ప్లిడర్ గారి ద్వారా గానీ హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకోవలెను, లేని ఎడల మీ పరోక్షమును తీర్మనించబడును.

వాయిదా తేది. 17-09-2025

// శ్రీ కోర్ట్ వారి ఉత్తరుల ప్రకారం //

కేసనశెట్టి నరేష్
పేటిషనర్ తరపు న్యాయవాది
తెనాలి

ప్రజాశక్తి
శుక్రవారం 12 సెప్టెంబర్ 2025

రాజకీయ లబ్ధికే వైసీపీ తప్పుడు ప్రచారం

కనిగిరి ప్రాంతంలో యూరియా కొరత లేదు

తప్పుదారి పట్టిస్తే కేసులు నమోదు చేస్తాం

ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి

ప్రజాశక్తి-కనిగిరి

రాజకీయ లబ్ధికే వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని.. యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. కనిగిరి ఆర్డీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎరువుల దుకాణాల డీలర్లు మరియు వ్యవసాయ శాఖ సిబ్బందితో సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యూరియా కొరత లేకపోయినా రాజకీయ లబ్ధి కోసం ప్రతిపక్ష వైసిపి నేతలు తప్పుడు ప్రచారాన్ని చేయడం తగదన్నారు. నిజంగా సమస్య ఉండి పోరాడితే స్వాగతిస్తామని అలా కాకుండా రైతులను తప్పు దోవ పట్టించేలా తప్పుడు ప్రచారం చేస్తే వారిపై కేసులు నమోదు చేసేందుకు వెనుకాడేది లేదని హెచ్చరించారు. రైతులు ఎంతో కష్టనష్టాలతో వ్యవసాయాన్ని చేస్తుండగా వారికి మేలు జరిగేలా వ్యవహరించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అందుకే అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ఆర్థిక సహకారం అందించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు తెలియపరచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఎరువుల దుకాణాల డీలర్లు రైతులకు ఇబ్బంది కలగకుండా ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు సకాలంలో అందేలా చూడాలని సూచించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి

రైతులను మోసం చేయకుండా న్యాయబద్ధంగా వ్యాపారం నిర్వహించాలని సూచించారు. యూరియా బస్తా రూ.250 తమకు పడుతుందని అదనంగా ట్రాన్స్‌పోర్ట్ చార్జి రూ.20 పడుతుందని అలాగే రైతు భరోసా కేంద్రాల్లో 250 కే లభిస్తుందని అలాంటప్పుడు తాము ఇబ్బంది పడుతున్నామని సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. యూరియా కొనుగోలు చేయాలంటే ఇతర ఎరువులు కొనుగోలు చేయాలని లింకు పెడుతున్నారని ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని ఎమ్మెల్యేకి తెలిపారు. ఎరువుల దుకాణ డీలర్ల సమస్యలను జడ్పీ సమావేశంలో చర్చించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కనిగిరి ప్రాంతంలో యూరియా కొరత లేదని 200 టన్నులు యూరియా అందుబాటులో ఉందని ఇంకా అవసరమైతే తెప్పించడం జరుగుతుందని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు, టిడిపి శ్రేణుల రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు తగిన విధంగా పథకాలను అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందని రైతులు సద్వినియోగం చేసుకొని ఆర్థిక అభివృద్ధి సాధించాలని తెలిపారు. అనంతరం నూతనంగా నిర్మించిన రైతు బజార్‌ను పరిశీలించారు. త్వరలో రైతు బజార్‌ను ప్రారంభించడం జరుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణంలో గల శిథిల భవనాలను ఆయన పరిశీలించి వాటిని తొలగించేందుకు అనుమతుల కోసం నివేదికలను పంపించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. తొలగించిన భవనాల స్థానంలో ప్రజా ప్రయోజనకరమైన భవనాలను నిర్మించేందుకు కృషి చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కేశవర్ధన్ రెడ్డి, తహశీల్దార్ ఏవి రవిశంకర్, ఏడిఏ షేక్ జైనులాబ్దిన్, మున్సిపల్ కమిషనర్ పి.కృష్ణమోహన్ రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ శ్యామల కాశిరెడ్డి, ఆరు మండలాల వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షులు, టిడిపి నాయకులు యారవ శ్రీనివాసులు, ముచ్చుమారి చెంచిరెడ్డి, బాలు ఓబుల్ రెడ్డి, గంగవరపు నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

బస్సులో గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

5 కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

ఆర్టీసీ బస్సులో గంజాయి తరలిస్తున్నారన్న సమాచారంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ కె విజయ నేతృత్వంలో ఎస్టిఎఫ్, ఏఈఎస్, ఎక్సైజ్ శాఖ అధికారులు మార్టూరు సమీపంలోని బొల్లాపల్లి టోల్ ప్లాజా వద్ద సంయుక్తంగా దాడులు నిర్వహించి వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి ఐదు కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఎస్టిఎఫ్ అధికారులు తెలిపిన వివరాలు ప్రకారం... ఒరిస్సా రాష్ట్రానికి చెందిన సురేష్ మహాపాత్ర తన బంధువు విశాల్ బుట్కి నుంచి తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి చెన్నైలో అధిక ధరలకు విక్రయిస్తుంటాడు. గంజాయి విక్రయం కేసులో పలుమార్లు జైలుకు వెళ్లి బయటికి వచ్చి అదే వ్యాపారం చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో గురువారం విశాఖపట్నం నుంచి తిరుపతికి వెళుతున్న ఆర్టీసీ బస్సును అధికారులు తనిఖీ చేశారు. గంజాయి తరలిస్తున్న నిందితుడు సురేష్ మహాపాత్రని అరెస్టు చేసి అద్దంకి కోర్టులో హాజరు పరిచినట్లు అధికారులు తెలిపారు. ఈ దాడుల్లో పాల్గొన్న ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్లు మధుబాబు, జనార్ధన్, సీఐలు ఆర్.నరహరి, ఎస్.రామారావు, పర్చూరు ఎక్సైజ్ ఎస్సై శ్రీధర్ సిబ్బందిని ప్రకాశం–బాపట్ల జిల్లాల డీసీ కే.హేమంత్ నాగరాజు అభినందించారు.

పోక్సో కేసు నమోదు

ప్రజాశక్తి-కొత్తపట్నం : బాలికపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. కొత్తపట్నం ఎస్ఐ వేముల సుధాకర్ కథనం ప్రకారం.. కొత్తపట్నం మండలం వజ్జిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన దొడ్ల వీరారెడ్డి అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. దీంతో బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-కొత్తపట్నం: కొత్తపట్నం మండలం అల్లూరు ఎస్టీ యానాది కాలనీకి చెం దిన పొట్లూరి వెంకటేశ్వర్లు(47) మతిస్థిమితం లేక అల్లూరు చెరువు కట్టల దగ్గరలోని చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చెంది నట్లు ఎస్సై సుధాకర్ తెలియజేశారు. మలవరపు సుబ్బులు ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలి పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు.



వెంకటేశ్వర్లు మృతదేహం

యుటిఎఫ్ ఆధ్వర్యంలో 'రణభేరి' పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-దర్శి

రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు అవుతున్నా ఉపాధ్యాయ, ఉద్యోగులకు సంబంధించి ఆర్థిక పరమైన సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శిలు మీనిగ శ్రీను, టి.రాజ శేఖర్‌లు అన్నారు. ప్రభుత్వం ఉపాధ్యాయుల, ఉద్యోగులకు అండగా లేకపోవడం ఉపాధ్యాయ వర్గాల్లో ఆందోళనలకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని, నాలుగు డిఎలు బకాయిలున్నా కనీసం ఒక్క డిఎ కూడా ప్రకటించక పోవడం అన్యాయమన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రణభేరి గోడపత్రికలను యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిఆర్‌సి గడువు పూర్తి అయినా చైర్మన్‌ను నియమించక పోవడం, కనీసం ఐఆర్ ప్రకటిం చకపోవడం గత మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో వున్న ఎల్ ఇఎల్ఎస్ ఇవ్వకపోవడం పిఆర్‌సి అరియర్లు, డిఎ అరియర్లు ఇవ్వక పోవడం ఉపాధ్యాయ వర్గాలను తీవ్రంగా కలచి వేస్తుందన్నారు. పాఠశాలల్లో బోధనేతర పనులను కల్పిస్తూ అధిక భారాలను మోపుతూ ఉపాధ్యాయులను ఒత్తిడికి గురిచేయడం టార్గెట్లు పెట్టి వెంటనే సమాచారం ఇవ్వమనడం సరికాదన్నారు. పై అంశాలపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలనే ఉద్దేశ్యంతో యుటిఎఫ్ రాష్ట్ర వ్యాప్తంగా యుటిఎఫ్ రణభేరి జాతాను సెప్టెంబర్ 15 నుంచి 19 వరకు నిర్వహిస్తుందన్నారు. ఈ జాతా ఉపాధ్యాయులను చైతన్య పరుస్తూ కార్యక్రమాలు నిర్వహించి ప్రభుత్వం యొక్క ఆలోచన మారినట్లయితే సెప్టెంబర్ 25న విజయవాడలో బహి రంగ సభను నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. అందుకే ఈ దర్శి డివిజన్ పరిధిలో వున్న ఉపాధ్యాయులను చైతన్యం చేయుటకు రణభేరి పోస్టర్‌ను ఆవిష్కరించడం జరుగు తుందన్నారు. ఈ కార్యక్రమం లో కుటుంబ సంక్షేమ డైరెక్టర్ విజయ్‌కుమార్, అధ్యక్షులు కె.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి పి.ఖాసిం, సహాధ్యక్షులు ఎ.రామారావు, ఎల్ఆర్.స్రవంతి, మహిళా కార్యదర్శులు ఎంవి.నరసమ్మ, పద్మశ్రీ, కోశాధికారి కె.రామారావు, సీనియర్ నాయకులు వి.రామిరెడ్డి, గౌరవ అధ్యక్షులు ఎం.యలమందారెడ్డి, బి.రా మాంజనేయులు, డి.కష్ణారెడ్డి, ఎస్.ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.



రణభేరి గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

అంగన్‌వాడీలు సమయపాలన పాటించాలి

పలు కేంద్రాల్లో సీడీపీవో షేక్ ఆశా బేగం తనిఖీ

ప్రజాశక్తి- సీఎస్‌పురం రూరల్

అంగన్వాడీ కార్యకర్తలు సమయపాలన పాటించి, కేంద్రాలకు వచ్చే చిన్నారులకు మెనూ సక్రమంగా అమలు చేయాలని ఐసిడిఎస్ వెలిగండ్ల సీడిపిఓ షేక్ ఆషా బేగం అన్నారు. మండలంలోని నలజనంపాడు, పెదరాజుపాలెం, ఎగువపల్లి, చింతపూడి, సి.నాగులవరం, ఆర్కే పల్లి, కంభం పాడు, కోమటి గుంట, కె.అగ్రహారం అంగన్వాడీ కేంద్రాలను గురువారం ఆమె తనిఖీ చేశారు. మెనూ అమలులో, పిల్లల బరువులు తీయడంలో కొన్ని అక్రమాలను గుర్తించి తగు సూచనలు చేసినట్లు చెప్పారు. మెనూ ప్రకారం భోజనం చేయాలని, ప్రీస్కూల్ కార్యక్రమాలు జరిపించాలని, ప్రతి నెల పిల్లలకు బరువులు తీసి రికార్డు చేయాలని, ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 వరకు అంగన్వాడీ కేంద్రాలను తెరిచి ఉంచాలని, ప్రతి రోజు పిల్లలకు భోజనం ఇవ్వాలని, ప్రతి నెల గర్భవతులు, బాలింతలకు, 6 నెలల నుండి 3 సం. పిల్లలకు టేక్ హెూం రేషన్ పంచాలని తెలిపారు. కేంద్రాల నిర్వహణలో ఎటువంటి అక్రమాలకు పాల్పడిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆయా అంగన్వాడి కేంద్రాల కార్యకర్తలు నాగమణి, సునీత, గుణావతి, రామలక్ష్మి, అరుణ, అంకమ్మ, వరమ్మ, రాధా ఆయాలు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న సీడీపీవో

మార్టూరుకు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ లోకేష్ మృతదేహం

నివాళులర్పించిన పలువురు గ్రానైట్ యజమానులు

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

డల్లాస్‌లో మృతి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మృతదేహం మార్టూరుకు చేరుకుంది. బాపట్ల జిల్లా మార్టూరు పట్టణానికి చెందిన పాటిబండ్ల లోకేష్ (27) బీటెక్ పూర్తయిన వెంటనే మూడు సంవత్సరాల క్రితం ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్ళాడు. డల్లాస్‌లోని ఓ అపార్ట్ మెంట్ లో ఉంటూ ఎమ్మెస్ పూర్తిచేసుకుని ఇటీవల అక్కడే ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో గత గురువారం రాత్రి తను ఉండే అపార్ట్మెంట్‌పైన ఉన్న స్విమ్మింగ్ పూల్‌లో ఈతకని వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందాడని డల్లాస్ పోలీసులు మార్టూరులో ఉన్న లోకేష్ కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కుమారుడి మరణ వార్తతో దిగ్భ్రాంతికి గురైన లోకేష్ తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. డల్లాస్‌లో ఉన్న తమ బంధువుల ద్వారా తానా సహకారంతో లోకేష్ మృతదేహానికి అక్కడి ప్రభుత్వ లాంఛనాలు పూర్తి చేసుకొని గురువారం మార్టూరు చేరుకుంది.



పాటిబండ్ల లోకేష మృతదేహం

చౌదరి కాలనీలో విషాదఛాయలు

ఇంకొల్లు మండలం భీమవరం గ్రామానికి చెందిన పాటిబండ్ల వేణుబాబు గ్రానైట్ వ్యాపారం నిమిత్తం కొద్ది సంవత్సరాలుగా మార్టూరులోని చౌదరి కాలనీలో నివాసం ఉంటున్నారు. పెద్ద కుమారుడైన లోకేష్‌ని ఉన్నత చదువుల కోసం డల్లాస్‌కి పంపించారు. ఇటీవల కుమారుడికి అక్కడే సాఫ్వేర్ ఇంజనీర్‌గా ఉద్యోగం రావడంతో ఆనందపడుతున్న సమయంలో మృతి చెందటంతో తల్లడిల్లిపోయారు. మరికొద్ది రోజుల్లో రెండో కుమారుడు కూడా ఉన్నత చదువుల కోసం ఆస్ట్రేలియాకి బయలుదేరనుండగా ఈ ఘటన చోటు చేసు చేసుకుంది. లోకేష్ మృతదేహం గురువారం మార్టూరు చేరుకోవడంతో గ్రానైట్ అసోసియేషన్ నాయకులు, పరిశ్రమల యజమానులు వేణు బాబు నివాసానికి పెద్ద ఎత్తున తరలివచ్చి నివాళులర్పించారు.



మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను కలిసిన టిడిపి నాయకులు

మంత్రి గొట్టిపాటిని కలిసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి - పంగులూరు

మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను తెలుగుదేశం మండల నాయకులు చిలకలూరి పేటలోని ఆయన నివాసంలో గురువారం కలిశారు. ఇటీవల తెలుగుదేశం సంస్థాగత ఎన్నికల్లో టిడిపి మండల అధ్యక్షునిగా రావూరి రమేష్ బాబును ఎన్నుకున్నారు. టిడిపి పట్టణ అధ్యక్షునిగా రావూరి రమేష్ బాబు రెండవ సారి ఎన్నికయ్యారు. ఈ ఎన్నికకు సహాయ సహకారాలు అందించిన మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో టిడిపి బలోపేతం చేసేందుకు, ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలను అర్హులైన లబ్దిదారులు అందరికీ అందజేసి, వారిలో పార్టీ పట్ల అభిమానాన్ని పెంచేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు కుక్కపల్లి ఏడుకొండలు, గుర్రం ఆదిశేకర్, గుదిబండ్ల ఆది రెడ్డి, పూనాటి రామాంజనేయులు, పెడవల్లి అశోక్, ఎనికపాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న చైర్మన్ సాంబశివరావు

భోజనశాల నిర్మాణం పరిశీలన

ప్రజాశక్తి - చీరాల

పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు అసౌకర్యాలు లేకుండా అన్ని మౌలిక వసతులు కల్పించాలని, హై స్కూల్లో ఎలాంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకు వస్తే శాసన సభ్యులు ఎంఎం కొండయ్య సహకారంతో వెంటనే పరిష్కరిస్తామని మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు అన్నారు. స్థానిక కెజిఎం బాలికోన్నత పాఠశాలలో నిర్మాణంలో ఉన్న భోజనశాలను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డించి వారితో కొద్దిసేపు ముచ్చటించారు. తరువాత టీచర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలపై చర్చించారు. 9, 10వ తరగతుల విద్యార్థుల అవసరాలు తెలుసుకొని ఎలక్ట్రిసిటీ, వాటర్, టాయిలెట్స్ వంటి ప్రాథమిక సదుపాయాలు తక్షణమే సమకూర్చాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకటేశ్వరరావు, ఎఇ రవి కుమార్, కౌన్సిలర్ మామిడాల రాములు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డేటా ఎంట్రీ ఆపరేటర్ శిక్షణ

ప్రజాశక్తి - చీరాల

ఎపి నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక వైఏ మహిళా డిగ్రీ కాలేజీలో స్కిల్ హబ్ సెంటర్ నందు డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో మూడు నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ఎం మాధవి తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ చదివిన నిరుద్యోగ యువతీ, యువకులు జిల్లాలోని వనరులు, డిమాండ్ ఆధారంగా డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సు ఉచితంగా అందిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్ మురళి తెలిపారు. 18 నుంచి 30 ఏళ్ల లోపు యువతీ యువకులు ఈ నెల 30లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ప్రభుత్వం గుర్తింపు పొందిన సర్టిఫికెట్ అందిస్తుందని కో ఆర్డినేటర్ ఎం హారిక తెలిపారు. శిక్షణ కార్యక్రమాన్ని యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాల కొరకు 7981443777 నంబర్లో సంప్రదించాలని కోరారు.

ఏచూరి జీవితం భావితరాలకు ఆదర్శం

సీతారాం ప్రథమ వర్ధంతి సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య



నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు నాగబోయిన రంగారావు

ప్రజాశక్తి - పంగులూరు

సిపిఎం ఆల్ ఇండియా పూర్వ కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి జీవితం భావితరాలకు ఆదర్శమని సిపిఎం సీనియర్ నాయకులు నాగబోయిన రంగారావు అన్నారు. ఈ సందర్భంగా ఏచూరి చిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ విద్యార్థి జీవితం నుండి వామపక్షభావాలతో, చైతన్య వంతంగా ఉండే వారని, ప్రపంచ కమ్యూనిస్టు నాయకులను కలవడం, కమ్యూనిస్టులను ఐక్యం చేయడం వలన ఏచూరి అందే వేసిన చెయ్యి అని అన్నారు. బిజెపి మతోన్మాదం దేశాన్ని అల్లకల్లోలం చేస్తున్న ఈ తరుణంలో ఏచూరి ఆలోచన విధానం సరైందని అన్నారు. సిపిఎం జిల్లా నాయకులు తలపనేని రామారావు, రాయిని వినోద్ బాబు, గుడిపాటి మల్లారెడ్డి మాట్లాడుతూ కమ్యూనిస్టు ఉద్యమాన్ని దేశంలో ముందుకు తీసుకెళ్లడంలో ఏచూరి పాత్ర ఎంతో ఉందని అన్నారు. అంతకుముందు ఏచూరి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆదుం సాహెబ్, తానికొండ సుధాకరరావు, పి ఏలియా, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మేదరమెట్ల : కామ్రేడ్ సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సభ కొరిశపాడు మండలంలోని ప్రసంగలపాడులో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య మాట్లాడారు. సీతారాం ఏచూరి నమ్మిన సిద్ధాంతాన్ని అనుసరించటమే ఆయనకు ఇచ్చే ఘనమైన నివాళి అన్నారు. ఆయన పార్టీ కోసం చేసిన త్యాగాలు, ఆయన జీవిత చరిత్రలో కొన్ని సంఘటనలను గుర్తు చేశారు. అదే సందర్భంలో ప్రస్తుతం దేశంలో, రాష్ట్రంలో ఉన్న సమస్యల పరిష్కారానికి ఎర్రజెండా మాత్రమే ఏకైక పరిష్కారమని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎం ఆంజనేయులు, ప్రజా నాట్య మండలి పూర్వ గౌరవాధ్యక్షులు బొంతు దశరథ, ఎస్ కోటేశ్వరరావు, కంచర్ల సుబ్బారావు, కంచర్ల హరిబాబు, ఉబ్బ కోటేశ్వరరావు, కంచర్ల సురేష్ బాబు పాల్గొన్నారు.

మార్టూరు : కమ్యూనిస్టు ఉద్యమానికి సీతారాం ఏచూరి చేసిన సేవలు చిరస్మరణీయమని సిపిఎం సీనియర్ నాయకులు కె రామకోటేశ్వరరావు అన్నారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి గురువారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. విద్యార్థి దశ నుండే ఉద్యమాలలోకి వచ్చారని అన్నారు. మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలను ఐక్యం చేయడం, ప్రజా పరిరక్షణకు ఆయన కీలక పాత్ర పోషించారని అన్నారు. సిపిఎం పోలిట్ బ్యూరోస్ సభ్యునిగా, సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం కార్యదర్శి వై రాంబాబు, బోడెంపూడి సూరిబాబు, ఎస్ఎస్‌కె ఇబ్రహీం, వి కృష్ణమూర్తి పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య



మార్టూరులో ఏచూరి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం

బిఇసి వద్ద ఆటో స్టాండ్ ఏర్పాటు

ప్రజాశక్తి - బాపట్ల

ఆర్టీసి బస్సు సౌకర్యంలేని మారుమూల గ్రామాలకు ఆటోలు నడుపుతూ ప్రజలకు రవాణా సౌకర్యం కల్పిస్తున్న ఆటో కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఎన్నికల హామీలు నెరవేర్చాలని సిఐటియు పట్టణ నాయకులు కె శరత్ డిమాండ్ చేశారు. సిఐటియు ఆధ్వర్యంలో బాపట్ల ఇంజనీరింగ్ కాలేజి వద్ద ఆటో వర్కర్స్ యూనియన్ నూతన ఆటో స్టాండు ఏర్పాటు చేశారు. ఆటో స్టాండును ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ఎం బుచ్చిరాజు సిఐటియు జెండా ఆవిష్కరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా శరత్ మాట్లాడారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ పరిమిత వేగంతో ఆటోలో ప్రయాణికులను పరిమితంగా ఎక్కించుకొని సురక్షితంగా గమ్యం చేర్చాలని అన్నారు. ఆటో కార్మికుల ఐక్యతతో యూనియన్ ఏర్పాటు చేసుకోవడం మంచి పరిణామం అన్నారు. సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు మత్తు పానీయాలకు బానిసలు కాకుండా సక్రమమైన మార్గంలో జీవనం సాగిస్తూ ఆటో డ్రైవర్లు, వర్కర్లు మంచి నడవడిక కలిగి ఉండాలని అన్నారు. 18ఏళ్ళు నిండిన ప్రతి ఒక్కరు డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవాలని అన్నారు. కార్మికుల ఎప్పుడు ఏ సమస్య వచ్చినా సిఐటియు అండగా నిలుస్తుందని అన్నారు. కార్యక్రమంలో బాపట్ల ఇంజనీరింగ్ కాలేజీ ఆటో యూనియన్ నూతన కమిటీ అధ్యక్షుడు కె మరియదాసు, డి శ్రీనివాసరావు, పి వీరారెడ్డి, కె ఎలీషాబాబు, ఆటో స్టాండ్ నాయకులు కర్రిశీను, షేక్ వలి పాల్గొన్నారు.



ఆటో స్టాండును ప్రారంభిస్తున్న నాయకులు


అధికారులు సమన్వయంతో పని చేయాలి

ప్రజాశక్తి - బాపట్ల

ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా సూర్యలంక బీచ్‌లో ఈనెల 26, 27, 28 తేదీల్లో జరగనున్న బీచ్ ఫెస్టివల్ ఘనంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ సూచించారు. బీచ్ ఫెస్టివల్ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. బీచ్ ఫెస్టివల్‌కు విచ్చేసి వాహనాలు పార్కింగ్‌కు ఎంపిక చేసిన స్థలాల్లో ముళ్ళ చెట్లను తొలగించి శుభ్రం చేసే పనులు త్వరగా పూర్తి చేయాలని అన్నారు. సముద్రతీరం ఇసుకలో రాళ్లు, ప్లాస్టిక్ వ్యర్థాలు లేకుండా పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. బాపట్ల, సూర్యలంక మార్గంలో రహదారికి ఇరువైపులా ఉన్న చిల్లకంప, ముళ్ళపొదలను జెసిబి వంటి యంత్రాలతో వేగంగా తొలగించి పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యేతో పాటు తహశీల్దారు సలీమా పాల్గొన్నారు.



బీచ్ ఫెస్టివల్ పనులు పరిశీలిస్తున్న నరేంద్రవర్మ



పిడీ కొండా ప్రతిమను సన్మానిస్తున్న దృశ్యం

పిఇటి ప్రతిమకు ఘన సన్మానం

ప్రజాశక్తి - పంగులూరు

మండలంలోని చందలూరు జెడ్‌పి ఉన్నత పాఠశాల పిడి కొండా ప్రతిమను పాఠశాలలో గురువారం ఘనంగా సన్మానించారు. వ్యాయామ ఉపాధ్యాయిని కొండా ప్రతిమ జిల్లా ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయినిగా, జిల్లా ఎస్‌జిఎఫ్ సెక్రెటరీగా ఎంపికైన సందర్భంగా పాఠశాలలో గ్రామస్తులు, పాఠశాల ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించారు. ప్రధానోపాధ్యాయుని చందలూరి గిరిజ సభకు అధ్యక్షత వహించారు. గ్రామ ప్రముఖులు పెంట్యాల రామలింగ స్వామి, అడ్డగడ వెంకటసుబ్బయ్య, అజిత్ కుమార్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వడ్డవల్లి వీరనారాయణ, మురకొండ సుబ్బారావు, మాజీ జెడ్పిటిసి కరి సుబ్బారావు, అడ్డగడ సతీష్, కందిమళ్ళ ఆంజనేయులు, పాఠశాల పూర్వ ఉపాధ్యాయులు పఠాన్ కరిముల్లా, రావి శ్రీనివాసరావు, రావి చంద్రశేఖర్ తోపాటు విద్యా కమిటీ వైస్ చైర్మన్ శివ పార్వతి, గురజాల వెంకయ్య అమెను సన్మానం చేసి అభినందించారు. ప్రతి ఒక్కరూ చిన్న వయసులోనే ఎంతో కీర్తిని పొందిన ప్రతిమా మేడం జాతీయ స్థాయి యోగా పోటీల్లో విద్యార్థులు రాణించేలా శిక్షణ ఇచ్చి విద్యార్థులను జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో బహుమతులు సాధించేలా చేశారని అన్నారు. ఆటల్లో విద్యార్థులు మంచి ప్రతిభ చూపి జాతీయ స్థాయికి ఎదిగేలా శిక్షణ ఇచ్చారని అభినందించారు. విద్యార్థుల క్రీడా నైపుణ్యం వెలికి తీయడంలో ఆమె కృషిని ప్రశంసించారు. యోగ ప్రాముఖ్యత అందరికీ తెలిసేలా చేశారని అన్నారు. విద్యార్థులను ఉన్నతంగా తీర్చి దిద్దడంలో ఆమె కృషి చేశారని అన్నారు. ఆమె ఇంకా మరెన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. గ్రామస్తులందరూ ఈ విధంగా తనని సన్మానించి తన బాధ్యతను పెంచారని ప్రతిమా వారికి కృతజ్ఞతలు తెలిపారు.

కార్మికుల హక్కుల కోసం సమరశీల ఉద్యమాలు

వ్యవసాయ కార్మిక సంఘం

ప్రజాశక్తి-కొండపి

దుక్కి దున్ని, మొక్కనాటి, చమటను చిందించి, పంటలు పండిస్తున్న గ్రామీణ పేదల హక్కుల రక్షణ కోసం సమరశీల ఉద్యమాలకు సిద్ధం కావాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు పిలుపు నిచ్చారు. కొండపి మండలం పెరిదేపిలోని ముప్పరాజు శేషయ్య విజ్ఞాన కేంద్రంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల మహాసభ గురువారం నిర్వహించారు. ఈ సభకు అంగలకుర్తి బ్రహ్మయ్య, మల్లెల సంపూర్ణ, సుకన్య అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ స్వాతంత్రోద్యమానికి ముందు నుంచే భూమి కోసం, భుక్తి కోసం, కష్టజీవుల హక్కుల కోసం వ్యవసాయ కార్మికులను కూడగట్టి పోరుబాట నడిపించిన చరిత్ర వ్యవసాయ కార్మిక సంఘానికి ఉందన్నారు. తెలంగాణ ప్రాంతంలో నైజాం నవాబుకు వ్యతిరేకంగా సాగిన వీర తెలంగాణ విప్లవ పోరాటం, చల్లపల్లి జమీందారు, వెంకటగిరి రాజాకు వ్యతిరేకంగా జరిగిన అనేక పోరాటాలలో కష్టజీవులంతా వీరోచితంగా పాల్గొన్నారని తెలిపారు. ఆ పోరాటాల ఫలితంగా 1955లో భూసంస్కరణలు చట్టం సాధించబడినట్లు తెలిపారు.



జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

భూస్వాములు, జమీందారుల ఆధీనంలోని భూములు వ్యవసాయ కూలీలకు, పేద రైతులకు పంచబడ్డాయన్నారు. అమరజీవి పుచ్చలపల్లి సుందరయ్య 1936లో వ్యవసాయ కార్మిక సంఘాన్ని స్థాపించారన్నారు. ఆ సంఘం దేశవ్యాప్తంగా విస్తరించిందని కోట్లాది మంది కష్టజీవుల హక్కుల కోసం నికరంగా నిలబడినట్లు తెలిపారు. ఈ 92 ఏళ్ల కాలంలో అసమాన త్యాగాలు, వీరోచిత పోరాటాలు చేసి కష్టజీవులకు కొన్ని హక్కులు చట్టాలను సాధించినట్లు తెలిపారు. కనీస వేతన చట్టం, రైతులకు గిట్టుబాటు ధర, ప్రజలకు నిత్యావసర సరుకులు అందుబాటులోకి తెచ్చే విధంగా చౌక ధరల దుకాణాలు పోరాటాలతోనే వచ్చాయని తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కెజి.మస్తాన్ మాట్లాడుతూ వ్యవసాయ రంగం మీద ఆధారపడిన 65 శాతం మంది ప్రజల జీవితాలను దుర్భరం చేసే విధంగా కేంద్ర ప్రభుత్వ విధానాలు ఉన్నాయన్నారు. అమెరికా నుంచి ఎలాంటి సుంకాలు లేకుండా వ్యవసాయ ఉత్పత్తులు మన దేశంలోకి దిగుమతి చేసుకునేందుకు ప్రభుత్వం అంగీకరించటం ఆందోళనకరమన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నెరుసుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రాంతంలోనూ వ్యవసాయ కార్మిక సంఘం అనేక పోరాటాలు చేసిందన్నారు. వలస వచ్చి పనిచేసే పచ్చకు ముఠా కూలీలకు సౌకర్యాలు కల్పించాలని, ప్రమాదాలు జరిగినప్పుడు రక్షణ కల్పించాలని ఆందోళన కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. తొలుత సీనియర్ నాయకులు గడ్డం పిచ్చయ్య జండాను ఆవిష్కరణ చేశారు. సభలో మండల కార్యదర్శి పారాబత్తిన శ్రీనివాసరావు, లక్ష్మీపోగు సుధాకర్, ఎల్.దావీదు,ఎ.సూరిబాబు, నిర్మల,విశ్రాంత,సింగమ్మ,గోపి, ఆదాం, మల్లెల నిర్మల, పరిమళ, అంజమ్మ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అధికారులు

పొగనారు మడుల సాగుపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి-కొండపి

పొగ నారుమడులు సాగు చేసే రైతులు తప్పనిసరిగా పొగాకు బోర్డులో రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలని బోర్డు అధికారి సునీల్ కుమార్ తెలిపారు. కామేపల్లి గ్రామంలో ఎఫ్‌సివి పొగ నారుమడుల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరంలో అధిక పరిమాణంలో పండించిన పంట వలన రైతులు వేలం కేంద్రాలలో పొగాకును అమ్ముకోవడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు తెలిపారు. దాని దృష్టిలో ఉంచుకొని బోర్డు నిర్ణయించిన పంట పరిమితులలోనే పొగాకు పండించాలన్నారు. ఈ కార్యక్రమంలో కొండపి ఫీల్డ్ అసిస్టెంట్ శిరీష, కామేపల్లి ఫీల్డ్ అసిస్టెంట్ మనీష్ కుమార్,ఆయా గ్రామాల రైతులు. వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పొగాకు బేళ్ల అమ్మకం

ప్రజాశక్తి-టంగుటూరు

టంగుటూరు పొగాకు బోర్డు వేలం కేంద్రానికి మల్లవరప్పాడు, శివపురం, గొర్లమిట్ట, మిట్టపాడు గ్రామాలకు చెందిన రైతులు 887 బేళ్లను అమ్మకానికి తెచ్చారు. అందులో 645 పొగాకు బేళ్ళ అమ్ముడు పోయాయి. వివిధ కారణాల చేత 242 బేళ్లను తిరస్కరించారు. కిలో పొగాకు అత్యధిక ధర రూ. 331, పొగాకు అత్యల్ప ధర రూ.125, సరాసరి ధర రూ 234-09 పైసలు పలికింది. వేలం లో 19 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నట్లు వేలం నిర్వహణాధికారి అట్లూరి శ్రీనివాసరావు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

కొండపి : కొండపి పొగాకు వేలం కేంద్రంలో గురువారం 417 పొగాకు బేళ్ళు తిరస్కరణకు గురైనట్లు వేలం నిర్వహణ అధికారి సునీల్ కుమార్ తెలిపారు. క్లస్టర్ పరిధిలోని ధర్మవరం, కోయవారిపాలెం, ముక్కోడిపాలెం, తాటాకులపాలెం, వెంకట కష్టాపురం గ్రామాలకు చెందిన రైతులు 1,101 బేళ్లను అమ్మకానికి తెచ్చారు. అందులో 684 బేళ్లఅమ్ముడు పోయాయి. అయ్యాయి.వ్యాపారుల వివిధ కారణాలతో 417 బేళ్లను తిరస్కరించారు. కిలో పొగాకు గరిష్ఠ రూ. 329, కనిష్ఠ ధర రూ. 110, సరాసరి ధర 229.58 పైసలు పలికింది. వేలంలో16 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నట్లు వేలం కేంద్ర నిర్వాహణాధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ముప్పాళ్ళ పంచాయతీ 'ఎన్నిక' కేసు కొట్టివేత

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

నాగులుప్పలపాడు మండలం ఎం.ముప్పాళ్ళ గ్రామపంచాయతీ ఎన్నికలు 2021 ఫిబ్రవరి 9న నిర్వహించారు. ఈ ఎన్నికల్లో వైకుంఠ పద్మశ్రీ రెండు ఓట్ల మెజార్టీతో సర్పంచిగా గెలుపొందింది. దీంతో ఓటమి చెందిన ప్రత్యర్థి వర్గం ఎన్నికలు సక్రమంగా జరగలేదనిచ, అక్రమాలు జరిగాయంటూ కోర్టు లో కేసు కేశారు. అప్పటి నుంచి కోర్టులో కేసు నడుస్తుంది. 4 సంవత్సరాల ఏడు నెలల తరువాత ఒంగోలు జిల్లా పిడిఎం కోర్టులో ఇరుపక్షాలు వాదనలు వినిపించారు. రెండు ఓట్ల తేడాతో గెలుపొందిన సర్పంచి ఎన్నిక సక్రమంగా జరగలేదని అభియోగం చేసిన పిటిషనర్ వాదనలో పసలేదని కేసును కొట్టివేస్తూ గురువారం తీర్పు చెప్పారు. సర్పంచి తరపున రాష్ట్ర హైకోర్టు సీనియర్ కౌన్సిల్ పివివి. పద్మనాభం, జిల్లా కోర్టు న్యాయవాది పంగులూరి గోవిందయ్య వాదనలు వినిపించారు. పిటిషనర్ తరపున న్యాయవాది నాగేంద్రమ్మ వాదనలు వినిపించారు .



మాట్లాడుతున్న ఉద్యాన శాఖ అధికారి గోపిచంద్

రైతులకు శిక్షణ

ప్రజాశక్తి -మద్దిపాడు

జామ తోటల పెంపకంలో రైతులు స్మార్ట్ వ్యవసాయ పద్ధతులు పాటించాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి గోపీచంద్ తెలిపారు. మండల పరిధిలోని ఇనమనమెళ్లూరు గ్రామంలో జామ తోటల సాగులో సమగ్ర యాజమాన్య పరిస్థితులపై రైతులకు గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గోపిచంద్ మాట్లాడుతూ రైతులు పండ్ల నాణ్యతను పెంచడానికి ఫ్రూట్స్ కవర్స్‌ను వినియోగించాలన్నారు. అందుకు ఉద్యాన శాఖ హెక్టార్‌కు రూ.25 వేలు రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. కాయల కోత అనంతరం గ్రేడింగ్ ప్యాకింగ్ చేసుకోవడానికి వీలుగా తోటల్లో ప్యాక్ హౌస్ నిర్మించుకోవాలన్నారు. అందుకు ఉద్యాన శాఖ రూ.2 లక్షలు రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. ఉద్యాన శాస్త్రవేత్త రవీంద్రబాబు మాట్లాడుతూ తోటల్లో కాయల కోత అనంతరం కత్తిరింపులు చేయాలన్నారు. తద్వారా కొత్త కొమ్మలపై చిగురులు వచ్చి అధికంగా పూత, పిందె వచ్చి దిగుబడులు పెరుగుతాయని తెలిపారు. తోటలకు వెలుతురు బాగా ప్రసరిస్తుందన్నారు. తద్వారా నాణ్యమైన కాయల ఉత్పత్తి వస్తుందని తెలిపారు. ఉద్యాన అధికారి సంధ్య మాట్లాడుతూ ఉద్యాన శాఖ ద్వారా రైతులకు ప్రభుత్వం అనేక రాయితీలను ఇస్తున్నట్లు తెలిపారు. రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

15 నుంచి పశువులకు టీకాలు

ప్రజాశక్తి-మద్దిపాడు

పశువులకు గాలికుంటు రాకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయనున్నట్లు మద్దిపాడు పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ పి.కిషోర్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 15 నుంచి వచ్చేనెల 15 వరకూ మండలంలోని అన్ని గ్రామాలలోని పశువులకు టీకాలు వేయనున్నట్లు తెలిపారు. గాలికుంటు వ్యాధి ప్రమాదకరమైనదని, దీని వల్ల పశువు ఉత్పాదక శక్తి, పని సామర్థ్యం తగ్గిపోతుందన్నారు. దూడలు, పడ్డలు చనిపోయే ప్రమాదం కూడా ఉంటుందన్నారు. పశు పోషకులు తమకు తప్పనిసరిగా వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గుంతలు తవ్వారు.. పూడ్చడం మరిచారు..

- రాకపోకలకు ప్రజలు అవస్థలు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-శింగరాయకొండ

కేబుల్ ఏర్పాటుకు అనుమతులు తీసుకొని గుంతలు తీశారు. అనంతరం కేబుల్ ఏర్పాటు చేశారు. అనంతరం గుంతలు పూడ్చకుండా వదిలేశారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఘటన శింగరాయకొండ గ్రామపంచాయతీలో చోటు చేసుకుంటుంది. శింగరాయకొండ గ్రామపంచాయతీ పరిధిలోని కందుకూరు రోడ్డు వద్ద గత మూడు నెలలుగా గుంతలు అలాగే ఉన్నాయి. జియో కేబుల్ కోసం జెసిబిల ద్వారా గుంతలు తీసి వైర్లు ఏర్పాటు చేశారు. కేబుల్ పనిపోయిన తర్వాత ఆ గుంతలు పూడ్చలేదు. ఈ విషయం గురించి స్థానికులు అధికారుల దృష్టికి అనేసార్లు తీసుకెళ్లినా వారు పట్టించుకోవడం లేదు. కందుకూర్ రోడ్డు లోని మీసేవ – కీర్తి మెడికల్ షాప్ మధ్యలో ఉన్న గుంత నడిరోడ్డు మీదే ఉంది. దీంతో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, ప్రయాణికులు. వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు ఇప్పటికే చాలామంది గుంతలో పడిపోయారు. ఇప్పటికైనా అధికారులు జోక్యం చేసుకొని గుంతలను పూడ్చించాలని ప్రజలు కోరుతున్నారు.



రోడ్డు వెంబడి తీసిన గుంత

జ్యువెలరీ వర్క్‌షాపు ప్రారంభం

ప్రజాశక్తి- కొత్తపట్నం

కొత్తపట్నంలోని బీచ్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన సర్దార్ జ్యువెలరీ వర్క్ షాప్‌ను ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఒంగోలుకు దీటుగా ఇక్కడ జువెలరీ దుకాణం ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. ఒడా చైర్మన్ షేక్ రియాజ్ మాట్లాడుతూ ఇలాంటి షాపులు ప్రజలకు ఉపయోగపడే విధంగా ఉండాలన్నారు. నమ్మకంతో ప్రజలకు సేవ చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం నాయకులు హాసన్ ,ఆబిద్ మౌలానా, రాచగర్ల వెంకట్రావు, మదన్ , టిడిపి మండల అధ్యక్షుడు ద్వారపాకల శ్రీను, సింగరి శ్రీను పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న దుకాణం యజమాని

28న గిరిజన ప్రజా చైతన్య యాత్ర

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

గిరిజన ప్రజా చైతన్య యాత్ర ఈ నెల 28న ఒంగోలు నిర్వహిస్తున్నట్లు వడిత్యా శంకర్ నాయక్ తెలిపారు. స్థానిక బహుజన సమాజ్ పార్టీ కార్యాలయంలో యాత్రకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను గిరిజన సంఘాల నేతలతో కలిసి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన సంఘాల నాయకులు, మేధావులు, ఉద్యోగులు, కర్షకులు, ఉద్యమ కారులు ఈ చైతన్య యాత్రలో పాల్గొని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. గిరిజన హక్కుల రక్షణ, భవిష్యత్ కార్యాచరణ రూపకల్పన కోసం యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాజకీయాలకు అతీతంగా అన్ని సంఘాల నేతలు ఏకమై పోరాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన ప్రజా సమాఖ్య జిల్లా అధ్యక్షుడు రామావత్ సైదా నాయక్, ప్రజా పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు పేరం సత్యం, రామావత్ హనుమనాయక్, ఆంగోత్ కోటి నాయక్, జై.హరినాయక్, బలిసి నాయక్ తదితరులు పాల్గొన్నారు.



వర్క్ షాపులో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ జగదీష్ బాబు

బిజినెస్ ఎనలిటిక్స్‌పై వర్క్ షాపు

ప్రజాశక్తి - వేటపాలెం

స్థానిక సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కాలేజీలో ఎంబిఎ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు బిజినెస్ ఎనాలిటిక్స్‌పై మూడు రోజులు వర్క్ షాపును గురువారం ప్రారంభించినట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణా రావు, కరస్పాండెంట్ ఎస్ లక్ష్మణరావు, డాక్టర్ కె జగదీష్ బాబు తెలిపారు. ఈ వర్క్ షాపును డాక్టర్ కె శివ నాగేశ్వరరావు, సీనియర్, డేటా సైన్స్, హైదరాబాద్ మాజిక్ టెక్ సొల్యూషన్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఎంబిఎ హెచ్ఒడి డాక్టర్ ఆర్ ఇమ్మానుయేల్ తెలిపారు. ఆధునిక కంపెనీల ప్రస్తుత డేటా అధారం చేసుకొని రాబోయో కాలంలో కంపెని అభివృద్ధికి సరైన నిర్ణయాలు తీసుకోవడానికి బిజినెస్ ఎనలిటిక్స్ ఎంత గానో తోడ్పతుందని తెలిపారు. వర్క్ షాపులో కంపెనీల డేటా తయారు చేయటం, అవసారాలకు తగిన విధంగా డేటా రూపొందించటంపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. దానిపై ప్రయోగాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.



డ్రోన్ అందజేస్తున్న ఎఒ సుబ్బారెడ్డి

రాయితీపై డ్రోన్ అందజేత

ప్రజాశక్తి - పంగులూరు

రాయితీపై డ్రోన్లు ఇస్తున్నట్లు ఎఒ డి సుబ్బారెడ్డి తెలిపారు. మండలంలోని కొండమంజులూరులోని ఆంజనేయ కిసాన్ డ్రోన్ గ్రూపుకు 80శాతం రాయితీపై డ్రోఈగో డ్రోన్ కంపెనీకి చెందిన కిసాన్ డ్రోన్ సరఫరా చేశామని చెప్పారు. రూ.9.80లక్షల విలువైన డ్రోన్ రూ.7.80 లక్షలు రాయితీతో గ్రూపు సభ్యులైన రావుల సాంబశివరావు, రావుల రవిబాబు, కొలకలూరు ఏసోబు, అజయ్ బాబు, వెంకటేశ్వర్లుకు అందించామని తెలిపారు. రైతులకు పురుగు మందుల ఆదా, నీటి వాడకం తక్కువ, తక్కువ సమయంలో సరైన మోతాదులో పైరుపై పిచికారి చేయడం వలన పురుగులు, తెగుళ్ల సమర్ధవంతంగా నివారించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్ గడ్డం రవికుమార్, కంపెనీ ప్రతినిధి లీలా, నాయకులు సహదేవుడు, రావుల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



ఫాగింగ్ పరిశీలిస్తున్న కార్యదర్శి అనురాధ

దోమల నిర్మూలనకు ఫాగింగ్

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని పెదలంక గ్రామంలో గురువారం సాయంత్రం దోమల నిర్మూలనకు పంచాయతీ ఆధ్వర్యంలో ఫాగింగ్ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి టి అను రాధ, సర్పంచ్ వేములపల్లి రంజిత పాగింగ్ దగ్గరుండి పరి శీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామం లో దోమలు వృద్ధి చెందకుండా తగిన జాగ్రత్తలు వహిస్తు న్నామని అన్నారు. వర్షా కాలం దృష్ట్యా వర్షాలకు పల్లపు ప్రాంతాలు, గుంటలు నీటితో నిండిపోవడం వలన దోమ లు వృద్ధి చెందే అవకాశం ఉందని తెలిపారు. దీని వలన విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యలు తీసుకొని ఫాగింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

'అన్నా క్యాంటీన్' పరిసరాలు పరిశుభ్రంగా ఉంచండి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

పేద వారు భోజనం చేసే అన్న క్యాంటీన్ ప్రదేశం, పరిసరాలు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సంయుక్త కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ సిబ్బందిని ఆదేశించారు. ప్రకాశం భవనం ఎదురుగా వున్న అన్న క్యాంటిన్‌ను ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. భోజన ఏర్పాట్లను పరిశీలించారు. సంయుక్త కలెక్టర్ భోజనం చేస్తున్న ప్రజలతో మాట్లాడుతూ మీరు ఏమి పని చేస్తున్నారు? భోజనం ఎట్లా ఉంది? వంటి విషయాలను ఆరా తీశారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ఆవరణలో పారిశుధ్యం, ప్లేట్‌లు వేడినీళ్ళతో శుభ్రం



భోజనం చేస్తున్న ప్రజలతో మాట్లాడుతున్న జెసి ఆర్.గోపాలకృష్ణ

చేయడం, ఆహార నాణ్యత ఉండేలా చూడాలని, ఎటువంటి ఫిర్యాదులకు అవకాశం లేకుండా పనిచేయాలని సిబ్బందిని ఆదేశించారు.

ప్రెస్ క్లబ్ స్థల పరిశీలన

అనంతరం ప్రెస్ క్లబ్ ఏర్పాటుకు సంబంధించి మీడియా ప్రతినిధుల విజ్ఞప్తి మేరకు అన్న క్యాంటిన్ పక్కన ఉన్న ప్రదేశాన్ని ఆయన పరిశీలించారు. జెసి వెంట ఒంగోలు ఆర్డీఒ కె లక్ష్మి ప్రసన్న, ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కె వెంకటేశ్వరరావు, ఒంగోలు అర్బన్ తహశీల్దార్ పి మధుసూదన్ రావు, మీడియా ప్రతినిధులు, ఎపిడబ్ల్యుజెఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

పాకలలో ఉపాధ్యాయుల మధ్య కొట్లాట

ప్రజాశక్తి - శింగరాయకొండ

మండలంలో విద్యాశాఖలో వింత సంఘటనలు చోటుచేసుకుంటు న్నాయి. గత కొన్ని నెలలుగా పాఠశాలలో ఒకటి తర్వాత ఒకటి జరుగుతున్నప్పటికీ విద్యా శాఖ విచారణ మీద విచారణ చోటుచేసుకుం టున్నాయి. తాజాగా గురువారం నాడు పాకల పంచా యతీలోని చెల్లమ్మ గారిపట్టపు పాలెంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుల మధ్య కొట్లాట చోటుచేసుకుంది. మహిళా ఉపాధ్యాయురాల మీద మరో ఉపాధ్యాయుడు మధ్య జరిగిన వివాదంలో వారిలో మహిళా ఉపాధ్యాయురాలు ఆ ఉపాధ్యాయుని చెంప చెల్లుమనిపించినట్లు తెలుస్తుంది. ఈ సంఘటన మండలం మొత్తం వ్యాపించి మహిళా ఉపాధ్యా యురాలు ఉపాధ్యాయుడిపై దాడి చేయటం పెద్ద చర్చగా సాగుతుంది. ఇంతకు ముందు శానంపూడి పాఠశాలలో ఉపాధ్యాయుల మధ్య జరుగుతున్న వివాదం తీవ్ర స్థాయికి చేరింది. చివరకు అక్కడ విద్యార్థులే ఉపాధ్యాయులపై దాడి చేసేంతవరకు ఉపాధ్యాయులు మధ్య వార్ కొనసాగింది. ప్రస్తుతం ఆ వార్ కొనసాగుతూనే ఉంది. ఇటీవల ఊళ్లపాలెం జెడ్‌పి హై స్కూల్లో ఉపాధ్యాయుడిపై విద్యార్థుల తల్లిదండ్రులు దాడి చేసిన సంఘటన చోటుచేసుకుని ఉంది. ఆ విచారణలో ఉన్నతాధికారులు పాకల హైస్కూల్ కి వెళ్ళగా అక్కడ కూడా కొంతమంది ఉపాధ్యాయుల మీద ఆరోపణలు చోటుచేసుకున్నాయి. ఇలా వరుస సంఘటనలో శింగరాయకొండ మండల విద్యాశాఖలో గందరగోళం చోటు చేసుకుంటుంది. ఓ పక్క విచారణ, మరోపక్క కేసులు మరోపక్క ఉపాధ్యాయుల మధ్య కుమ్ములాటలు, మరోపక్క ఉపాధ్యాయులపై విద్యార్థులు దాడులతో గందర గోళం నెలకొన్నది. పాకల గ్రామపంచాయతీలోని చెల్లెమ్మ గారి పాలెం లో జరిగిన మహిళా ఉపాధ్యాయురాలు ఉపాధ్యాయుడిపై పాఠశాలలోనే దాడి చేయడం, అది విద్యార్థుల మధ్య ఈ సంఘటన జరగటం మండలంలో తీవ్ర చర్చ సాగుతుంది.

కొమ్మమూరు కాలువలోకి దిగి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కారంచేడు

ప్రతిరోజు కొమ్మమూరు కాలువలోకి ఈతకు దిగే వ్యక్తి ఎప్పటి లాగానే గురువారం కూడా ఈతకు దిగి గల్లంతైన ఘటన కారంచేడులో గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ ఖాదర్ భాషా, తహశీల్దారు నాగరాజులు తెలిపిన వివరాల ప్రకారం కారంచేడు గ్రామానికి చెందిన దగ్గుబాటి హరిప్రసాద్ (68) చీరాల ప్రాంతంలో తన భార్యతో కలిసి నివాసం ఉంటున్నాడు. ప్రతిరోజు స్వగ్రామమైన కారంచేడు వచ్చి కొద్దిసేపు వ్యాయామం చేసి కాలువలో ఈత కొట్టి తన ఇంటికి తిరిగి వెళుతుంటాడు. ఈ క్రమంలో గురువారం కాలువలో దిగిన వ్యక్తి నీటి ప్రవాహానికి గల్లంతయ్యాడని తెలిపారు. కొద్దిసేపటికి అతనికి సంబంధించిన వస్తువులు గట్టుపై ఉండడంతో సానికుల సమాచారం మేరకు విషయం తెలిసిన చీరాల ఆర్డీఒ చంద్రరశేఖర్ నాయుడు, తహశీల్దారు నాగరాజు, ఎస్ఐ ఖాదర్ భాష ఈ తగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. ఉదయం నుండి సాయంత్రం వరకు గాలింపు చర్యలు ముమ్మరంగా చేయడంతో సాయంత్రం మృతదేహం వెలుగు చూసింది. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ప్రతిరోజు గ్రామానికి వచ్చి వెళ్తుండే హరిప్రసాద్ మృతి చెందడం చూసిన గ్రామస్తులు, బంధువులు కన్నీటి పర్యంతం అయ్యారు. మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

18న ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణ

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

నగరపాలక సంస్థ పరిధిలో కొత్త కూరగాయల మార్కెట్‌కు ఎదురుగా గల ఇ-వేస్ట్ సెంటర్ నందు స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా 4వ శనివారం అంటే ఈనెల 18న ఎలక్ట్రానిక్ వ్యర్థాలు ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేట్ సంస్థల నుండి సేకరించు కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు నగర పాలక సంస్థ కమీషనర్ డాక్టర్ కె వెంకటేశ్వ రరావు తెలిపారు. మానిటర్లు, ప్రింటర్లు, కీబోర్డులు, మౌస్ మొదలైన వాటిని సేక రించనున్నట్లు తెలి పారు. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఆదేశాల మేరకు పర్యావరణ పరిరక్షించు టం జరుగు తుందని అన్నారు. ఈఇ-వేస్టును పున ర్వినియోగం కోసం వినియో గిస్తారు. నగరంలోని ప్రజలు కంప్యూ టర్ సెంటర్ల వారు, విద్య సంస్థలు, కళాశాలలు, ప్రభుత్వ, ప్రైవేటు ఆఫీసుల్లోని ఇ-వేస్ట్‌ను మున్సిపల్ కార్పొరేషన్ పరిదిలో షేక్ బాజ్జీ, శానిటరీ ఇన్స్పెక్టర్ 9849907256, ఎన్ పిచ్చయ్య సూపర్వైసర్ 9849908063 ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి సంప్రదించాలని తెలియజేశారు.

క్రీడాకారుల ఎంపిక పోటీలు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

స్థానిక టిఎం రావు ఉన్నత పాఠశాల్లో మండల స్థాయి క్రీడాకారుల ఎంపిక చేశారు. ఈ క్రీడా పోటీలు ఎంపిపి డివి లలిత కుమారి ప్రారంభించారు. ఎంఇఒ నీలం దేవరాజ్, భట్టిప్రోలు సర్పంచి ధారా రవికిరణ్మయి, ఉప సర్పంచ్ బుర్లే రాంప్రసాద్ మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆదేశాల మేరకు జరగనున్న రన్నింగ్, షాట్ పుట్, డిస్కస్ త్రో వంటి పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అండర్ 14, అండర్ 17 బాల బాలికల విభాగాల్లో జరిగిన ఈ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎంపిక చేసినట్లు తెలి పారు. 100మంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్న ట్లు తెలిపారు. కబాడీ, వాలీబాల్ క్రీడాకారుల ఎంపిక శుక్రవారం చేయనున్నట్లు తెలిపారు. మండల కో ఆర్డినేటర్ చేబ్రోలు శ్రీనివాసరావు, ఎండి అనిల్ హుక్, జివిఎస్ నాగేశ్వరరావు, వాకా హరి పసాద్, వీర్ల శ్రీనివాసరావు, పి బాబు, టి శ్రీనివాసరెడ్డి, కె లక్ష్మి, ఆర్‌వి పద్మ పాల్గొన్నారు.



పిఎసి సమావేశంలో ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి

పిఎసి మీటింగ్‌లో ఎంపి మాగుంట

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ప్రజా పద్దుల కమిటీ (పిఎసి) స్టడీ టూర్‌లో భాగంగా కోల్‌కతా హెూటల్ తాజ్ బెంగాల్‌లో కమిటీ చైర్మన్ కెసి వేణుగోపాల్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు. సమావేశంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి (ఎంజి ఎన్‌ఆర్ఈజిఎస్) సంబంధించి కేంద్ర ప్రాయోజిత సంక్షేమ పథకాల అమలుపై, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ప్రతినిధులు, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో కమిటీ మెంబెర్, ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మండల స్థాయి స్కూల్ గేమ్స్

ప్రజాశక్తి - వేటపాలెం

విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తి పెంపొందించడమే లక్ష్యంగా మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 15, 16 తేదీల్లో బిబిహెచ్ కళాశాలలో ఈ క్రీడలు జరగనున్నట్లు మండల కో ఆర్డినేటర్ జె దేవబిక్షం తెలిపారు. సెప్టెంబర్ 15న అథ్లెటిక్స్ విభాగపు పోటీలు, 16న గేమ్స్ విభాగపు పోటీలు బాల, బాలికల కోసం నిర్వహించనున్నట్లు తెలిపారు. హై స్కూల్స్ విద్యార్థులు ఈ పోటీల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు. ఈ పోటీల్లో రెండు వయో కేటగిరీల్లో విద్యార్థులకు అవకాశం కల్పించారు. 14ఏళ్ల కేటగిరీ 2012 జనవరి తరువాత జన్మించిన విద్యార్థులు, 17ఏళ్ల కేటగిరీ 2009 జనవరి తరువాత జన్మించిన విద్యార్థులు పాల్గొననున్నట్లు చెప్పారు. ప్రతి పాఠశాలలోని వ్యాయామ విద్య ఉపాధ్యాయులు తమ పాఠశాలల విద్యార్థులను ముందుగానే సిద్ధం చేసి పోటీల్లో పాల్గొన డానికి తీసుకురావాలని కోరారు. క్రీడల ద్వారా శారీరక దారుఢ్యం పెంపొందడమే కాకుండా విద్యార్థుల్లో పోటీ స్ఫూర్తి పెరుగుతుందని అన్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థు లకు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పించను న్నట్లు తెలిపారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచే విద్యార్థులు తదుపరి స్థాయికి ఎంపిక అవుతారని, అందుకే ఈ అవకా శాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు బూదవాడ రానున్న మంత్రి గొట్టిపాటి

ప్రజాశక్తి - పంగులూరు

మండలంలోని బూదవాడలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ పర్యటిస్తున్నట్లు ఆయన కార్యాలయ ప్రతినిధులు తెలిపారు. ఉదయం తొమ్మిదిన్నర గంటలకు జెడ్‌పి ఉన్నత పాఠశాలలోని విద్యార్థినీ, విద్యార్థులకు 210 సైకిళ్లను పంపిణీ చేయనున్నట్లు పాఠశాల హెచ్ఎం పూసల రఘురామయ్య తెలిపారు.

ప్రజాశక్తి
శుక్రవారం 12 సెప్టెంబర్ 2025

ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - బాపట్ల

వాహన మిత్ర పథకం లబ్ధిదారులను పెంచకుండా ఆటో కార్మికుల ప్రధాన సమస్యలను పరిష్కార మార్గం చూపకుండా వాహన మిత్ర పథకం ద్వారా కేవలం రూ.15వేలు అందిస్తామని ప్రకటించడం పట్ల ప్రభుత్వ వైఖరిని ఎపి ట్రాలీ ఆటో వర్కర్స్ యూనియన్ సిఐటియు జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తుందని సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ మజుందార్ అన్నారు. సిఐటియు జిల్లా కార్యాలయంలో జరిగిన ఆటో వర్కర్స్ యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆటో కార్మికుల ప్రధాన సమస్యలైన సంక్షేమ బోర్డు ఏర్పాటు, జిఒ నెంబర్ 21 రద్దు, ఆటో కార్మికులకు డీజిల్, పెట్రోల్ తగ్గించటం, ఇచ్చిన హామీపై కూటమి ప్రభుత్వం స్పందించకుండా కేవలం రూ.15 వేలు మాత్రం వాహన మిత్ర పథకం ద్వారా దసరా నుండి అందిస్తామని ప్రకటించడాన్ని సిఐటియు తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు పథకంతో ఆటో కార్మికులు ఇప్పటికే 60శాతం ఆదాయం కోల్పోయారని అన్నారు. ఈ పథకంతో నష్టపోయిన ఆటో కార్మికుల సమస్యపై చర్చించడం కోసం ఏర్పాటు చేసిన ఉప సంఘం కనీసం ఆటో కార్మికులతో చర్చించకుండా ఏకపక్షంగా వాహన మిత్ర అమలు చేస్తామని ప్రకటించడం సరైన పద్ధతి కాదన్నారు. జగన్మోహన్‌రెడ్డి కాలంలో ఏర్పాటు చేసిన పథకాల పేర్లు మార్చేసి నేడు వాహన మిత్ర పథకం, అలాగే ఉంచడమనేది దీని వెనుక కుట్ర ఉందని అన్నారు. వాహన మిత్ర పథకం కేవలం ఓనర్ కం డ్రైవర్‌కు మాత్రమే వర్తిస్తుందని అన్నారు. రాష్ట్రంలో వేలాది మంది ఆటో అద్దెలకు తీసుకొని డ్రైవర్లగా పనిచేస్తున్నారని లైసెన్స్ ఉండి ఆటో నడుపుతున్న ప్రతి ఒక్క డ్రైవర్ ఈ వాహన మిత్ర పథకాన్ని అమలు చేయాలని, వాహన మిత్ర పథకం ద్వారా ప్రకటించిన రూ.15వేలు గాక రూ.25 వేలు అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షులు బి బుచ్చిరాజు మాట్లాడుతూ ప్రభుత్వం జిఒ నెంబర్ 21 ద్వారా పెద్ద ఎత్తున ఆటో కార్మికులపై పెనాల్టీలు విధిస్తూ రూ.వేలు వసూలు చేస్తున్నారని అన్నారు. జిఒ నెంబర్ 21 రద్దు చేస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీపై ప్రభుత్వం ఊసు లేదన్నారు. ఆటో కార్మికుల సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేసి ఆ పథకం ద్వారా కార్మికులకు సంక్షేమ పథకాల అమలు చేస్తామని పాదయాత్రలో లోకేష్ ఇచ్చిన హామీపై ఎక్కడ ప్రస్తావించలేదని అన్నారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలకు వ్యతిరేకంగా ఈనెల 18న చలో విజయవాడ చేపడుతున్నామని అన్నారు. దీనికి పెద్ద ఎత్తున ఆటో కార్మికుల పాల్గొనాలని కోరారు. ఒకవైపు ఆటో కార్మికులకు కనీసం ఆయిల్‌కు డబ్బులు రాని పరిస్థితిలో అనేకచోట్ల పోలీసుల భారీ పెనాల్టీలు రాస్తున్నారని అన్నారు. ఆటో కార్మికులకు అన్ని మున్సిపల్ మండల కేంద్రాల్లో ఆటో స్టాండ్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ రామకృష్ణ, కె శ్రీనివాసరావు, నాగరాజు, అంకమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆటో కార్మిక సంఘం నాయకులు బుచ్చిరాజు


రోడ్డుకు అడ్డంగా తోలిని ఇసుక కుప్ప

ప్రమాదకరంగా రోడ్డుపై ఇసుక దిబ్బ

ప్రజాశక్తి - వేటపాలెం

మండలంలోని దేశాయిపేట పంచాయతీ ఆమోదగిరి పట్నం హెచ్‌పి పెట్రోల్‌బంక్ వెనుక ఎస్సీ కాలనీ రోడ్డులో నెల రోజులుగా పేరుకుపోయిన ఇసుక దిబ్బ స్థానికులకు ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. రోడ్డుకి అడ్డంగా ఉన్న ఇసుక కారణంగా స్కూలుకు వెళ్లే విద్యార్థుల నుండి పనులకెళ్లే పెద్దవాళ్ల వరకు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతిరోజూ సైకిల్‌పై స్కూలుకు వెళ్లే పిల్లలు ఇసుక దిబ్బ వద్ద ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించుకునే క్రమంలో ప్రమాదాలు తప్పించుకుంటున్నా ఎప్పుడైనా పెద్ద ప్రమాదం సంభవించే అవకాశం ఉందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 'చిన్నారుల ప్రాణాలు ఫణంగా పెట్టి స్కూలుకు పంపిస్తున్నామని అన్నారు. అధికారులు ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డు దాటలేని పరిస్థితి ఏర్పడటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నెల రోజులుగా ఇసుక దిబ్బ అలాగే ఉంది. పలుమార్లు స్థానిక ప్రజలు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇంత నిర్లక్ష్యం ఎప్పుడూ చూడలేదని స్థానికులు వాపోతున్నారు. కాలనీ వాసులు మరోసారి అధికారులను హెచ్చరిస్తూ వెంటనే చర్యలు తీసుకోకపోతే సమస్య తీవ్రతరం అవుతుందని, పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టాల్సి వస్తుందని స్పష్టం చేశారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - ముండ్లమూరు

మండలంలోని 48 గ్రామ సంఘాలకు 2024, 2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వెలుగు కార్యాలయంలో గురువారం ఆడిట్ నిర్వహించారు. సబ్సిడీ రుణాల కొరకు దరఖాస్తు చేసుకోవాలని వెలుగు ఎపిఎం ఎం హనుమంతరావు మాట్లాడారు. చేపల పెంపకం అయిన కొర్రమీను యూనిట్ కాస్ట్ రూ.4.40లక్షలు కాగా రూ.1.40లక్షల రాయితీ ఫోను లబ్ధిదారుడు రూ.3లక్షలు చెల్లించాలని అన్నారు. షెడ్‌నెట్ కాస్ట్ రూ.3.20లక్షలు కాగా రూ.1.60 లక్షల రాయితీ పోను ఉన్నతి పథకం ద్వారా రూ.1.60లక్షల రుణం ఇవ్వనున్నట్లు తెలిపారు. పిఎంఈజిపి, పిఎం ఎఫ్‌ఎంఈ పథకం ద్వారా పాడి గేదలు, గొర్రెలు, కోళ్ల పెంపకానికి బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అకౌంట్ ఆఫీసర్ ఎస్ దినేష్, ఎస్ పుల్లారెడ్డి, సిసిలు సుచంద్ర, రత్న కుమారి, పని బాబు, కోటేశ్వరమ్మ, అకౌంటెంట్ జె మార్తమ్మ పాల్గొన్నారు.

సమతుల్య ఆహారంతో రక్తహీనత నివారణ

ప్రజాశక్తి - వేటపాలెం

సమతుల్య ఆహారంతో రక్తహీనత నివారించవచ్చని ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఒ టి ఝాన్సీ తెలిపారు. ఐసిడిఎస్ ప్రాజెక్టు సమావేశ హాలులో మిషన్ శక్తి సంకల్పం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు, కిశోర బాలికల ఆరోగ్యం, రక్తహీనత సమస్యపై చర్చించారు. సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారా రక్తహీనత నివారించవ చ్చని అవగాహన కల్పించారు. పౌష్టికాహారం ప్రాముఖ్యత వివరించారు. మహిళలు, ఆడపిల్లలు ఎదుర్కొం టున్న వివక్ష, సమాన అవకాశాల లోపం గురించి చర్చించారు. మహిళల హక్కులు, వారికి ఇవ్వాల్సిన గౌరవం గురించి స్పష్టం చేశారు. పిసిపిఎన్‌డీటీ చట్టం ఉద్దేశ్యం వివరించారు. ఆడపిల్లలను కాపాడటం, వారికి సమాన అవకాశాలు కల్పించడంపై అన్నారు. ఆడపిల్లని చదవనిద్దాం, ఆడపిల్లను ఎదగనిద్దాం అనే నినాదాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని చెప్పారు. బాల్య వివాహం చట్టరీత్యా నేరమని వివరించారు. చిన్న వయసులో పెళ్లి వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక సమస్యలు చర్చించారు. బాల్య వివాహం నిర్మూలన కోసం అందరూ కలసి పనిచేయాలని అన్నారు. ఈ అవగాహన ద్వారా మహిళలు, కిశోర బాలికలకు మాత్రమే కాకుండా అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణాత్మకంగా ఉపయోగపడింది. ఆరోగ్య పరమైన జాగ్రత్తలు, చట్టపరమైన అంశాలు, సామాజిక సమస్యల పరిష్కార మార్గాలు అనే అన్ని కోణాల్లో సమాచారాన్ని అందించడం విశేషం. సమాజ అభివృద్ధిలో మహిళలు, బాలికలు కీలక పాత్ర పోషిస్తారని అన్నారు. వారికి విద్య, ఆరోగ్యం, భద్రత కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత నొక్కి చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా మహిళలు, బాలికల్లో చైతన్యం పెంపొందిందని ఆశాభావాన్ని వ్యక్త చేశారు.



మిషన్ శక్తి సంకల్పం ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

వివాహేతర సంబంధమే హత్యకు కారణం

- యువకుడి హత్యకేసులో లొంగిపోయిన నిందితుడు
- వివరాలు వెల్లడించిన టూటౌన్ సిఐ నాగభూషణం



వివరాలు వెల్లడిస్తున్న సిఐ నాగభూషణం

ప్రజాశక్తి - చీరాల

పట్టణంలోని హారిస్ పేటలో ఇటీవల జరిగిన అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి కేసు మిస్టరీ గురువారం వీడింది. తన భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని, ఇతరులతో కూడా అక్రమ సంబంధానికి సహకరిస్తున్నాడని పథకం ప్రకారమే హత్య చేశానని అదే ప్రాంతానికి చెందిన సలగల విజయబాబు గురువారం రెండవ పట్టణ పోలీసు స్టేషన్లో లొంగిపోయాడు. ఈ విషయంపై రెండో పట్టణ సీఐ నాగభూషణం విలేకర్లతో మాట్లాడారు. పట్టణంలోని హారిస్ పేటలో నివాసం ఉంటున్న పేర్లీ కోటేశ్వరరావు (35) అలియాస్ బుల్లాబ్బాయి ఈ నెల 3న పేటలోని చిలచెట్లలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందటంతో ఆ ప్రాంత వాసులు భయభ్రాంతులకు గురయ్యారు. అయితే మృతుడి భార్య పేర్లీ ప్రియాంక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కోటేశ్వరరావుది అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు కేసు దర్యాప్తు వేగవంతం చేశారు. అయితే అదే ప్రాంతంలో నివాసం ఉంటు ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్న సలగల విజయబాబు విఆర్ఒ సమక్షంలో కోటేశ్వరరావును తానే హత్య చేశానని పోలీసుల ఎదుట లింగిపోయాడు. ఈనెల 3న రాత్రి వేళలో కోటేశ్వరరావును హత్య చేసినట్లు పోలీసులకు తెలిపాడు. దీంతో నిందితునిపై క్రైమ్ నెంబర్ 185/2025 యు/ఎస్ 103(1) బిఎన్ఎస్ సెక్షన్ కింద అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్ఐ వెంకటేశ్వర్లు ఉన్నారు.



వర్క్ షాపులో మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్

15 నుండి 'మహిళా' వర్క్‌షాపు

ప్రజాశక్తి - అద్దంకి

సింగరకొండ కట్ట రామ కోటేశ్వరరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళ సాధికారిక విభాగం, ఎంఎస్ఎస్ విభాగాల కన్వీనర్స్ షర్మిలరాణి, డి రాజశేఖర్ ఆధ్వర్యంలో ఈనెల 15 నుండి 19 తేదీల్లో వర్క్ షాపును స్నేహిత శీర్షికతో కళాశాల విద్యార్థులకు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వి రామ మోహనరావు తెలిపారు. దీనిలో భాగంగా 15, 16 తేదీల్లో స్థానిక న్యూ లుక్స్ బ్యూటీ పార్లర్ యాజమాన్యం సిహెచ్ పద్మావతిచే కేశాలంకరణ మెహందీలపై వర్క్ షాపు నిర్వహించనున్నట్లు తెలిపారు. 17న ఈ మల్లేశ్వరిచే కోలాటంపై శిక్షణ, 18న డాక్టర్ మాధురి వైద్య విభాగం ఆరోగ్యం పరిశుభ్రతపై అవగాహన, మెడికల్ క్యాంపు నిర్వహించనున్నట్లు తెలిపారు. 19న ఈ అనూష న్యాయవాదిచే మహిళా చట్టాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశం ఇతర కళాశాల విద్యార్థులు ఉపయోగించుకోవచ్చని అన్నారు. మరింత సమాచారం కొరకు 9246481837 నంబర్‌లో సంప్రదించవచ్చని అన్నారు.


యూరియాపై అవగాహన కల్పిస్తున్న ఎఒ బ్రహ్మారెడ్డి

నానో యూరియా వినియోగించాలి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని భట్టిప్రోలు, కోనేటిపురం గ్రామాల్లో యూరియా పంపిణీ గురువారం చేశారు. ఈ సందర్భంగా ఎఒ బి బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ యూరియా వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. మండలంలో యూరియా సమృద్ధిగా లభిస్తున్నప్పటికీ యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూరియా వాడుకోవటం ద్వారా ఉండే ప్రయోజనాలు రైతులకు వివరించారు. నానో యూరియా అర లీటరు రూ.250 ఉంటుందని, దానిని పిచికారీ చేసుకోవటం సులభమని అన్నారు. 45 కేజీల యూరియా బస్తాలో ఉండే పోషకాలు అన్నీ అరలీటరు నానో యూరియా డబ్బాలో ఉంటాయని అన్నారు. యూరియా గుళికల కంటే ద్రవ రూపాల్లో ఉండే నానో యూరియా మొక్కలకు బాగా అంది పంట బాగుంటుందని తెలిపారు. నానో యూరియా మొక్క ఆకుల మీద పడే విధంగా పిచికారీ చేసుకోవాలని సూచించారు. రైతులు అందరూ సంప్రదాయ యూరియా బదులు నానో యూరియా వాడటం అలవాటు చేసుకోవాలని కోరారు.

జూదరులకు జరిమానా

ప్రజాశక్తి - యద్దనపూడి

యద్దనపూడి ఎస్ఐ రత్న కుమారి బుధవారం రాత్రి మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. న్యాయమూర్తి ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్ఐ వాహన దారులుకు సూచనలు చేశారు. వాహదారులు ఎవరైనా నిబంధనలు అతి క్రమిస్తే పోలీస్ శాఖ చట్ట పరమైన చర్యలు తీసుకుంటుందని చెప్పారు. కోర్టు తగిన చర్యలు తీసుకుంటుందని అన్నారు. వాహనదారులెవరు నిబంధనలు అతిక్రమించ వద్దని అన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని అన్నారు. ఎక్కడైనా జూదం ఆడుతున్నట్లు గమనిస్తే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని చెప్పారు.

రెండు కీలక రహదారుల విస్తరణ

కార్పొరేషన్ సమావేశం ఎజెండాలోకి

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో



ట్రంక్ రోడ్డు ఇదే..

పట్టణంలో రెండు కీలక రహదారుల విస్తరణ కీలక అంశంగా మారింది. ట్రాఫిక్ రద్దీ రీత్యా పలు రహదారులను విస్తరించాలని నిర్ణయించారు. మాస్టర్‌ప్లాన్‌కు అనుగుణంగా రహదారులపై కార్పొరేషన్ ఇప్పటికే దృష్టి సారించింది. ఇందులో భాగంగా పట్టణంలో కీలకమైన ట్రంకురోడ్డు, మస్తాన్ దర్గాసెంటర్ నుంచి కొత్తపట్నం బస్టాండు వరకూ వెళ్లే రహదారులను వెడల్పు చేయనున్నారు. గతంలో వీటిపై సమావేశాల్లో అంశాలుగా పెట్టినప్పటికీ పలు కారణాల వల్ల వాయిదా వేశారు. రహదారుల విస్తరణపై ఇప్పటికే వ్యాపారులతో ఎమ్మెల్యే దామచర్లతో పాటు మున్సిపల్ అధికారులు చర్చలు జరిపారు. వారికి ప్రత్యామ్నాయంగా ఇచ్చే సౌకర్యాల పైనా చర్చించారు. అయితే కొందరు వ్యాపారులు కోర్టుకువెళ్లగా వారికి తీర్పు ప్రతికూలంగా వచ్చింది. ట్రంకురోడ్డు విస్తరణకు గ్రీన్‌సిగ్నల్ వచ్చింది.మాస్టర్‌ప్లాన్ ప్రకారం 100 అడుగులకు కోర్టు నుంచే ఆదేశాలు వచ్చాయి. రహదారుల్లో దుకాణాలు పోయేవారికి పరిహారం ఇవ్వాలని సూచించింది. దీంతో దుకాణాల వారితో జరిపినచర్చల్లో ఇచ్చిన హామీలు అమలుపైనా స్పష్టత లేకుండా పోయింది.వ్యాపారులు కోర్టుకు వెళ్లడంతో ఇపుడు అధికారులు కూడా కోర్టు డైరెక్షన్ ప్రకారమే పోవాలనే ఆలోచనలో ఉన్నారు.శుక్రవారం జరగనున్న సమావేశంలో 100 అడుగులకే తీర్మానం చేస్తారా?లేక 80 అడుగులా?అనేదీ తేలాల్సిఉంది. దీనిపై చర్చ సాగనుంది. వ్యాపారులు కోర్టుకు వెళ్లడంతో ఇపుడు పాలకపక్షం వైకిరి ఎలా ఉంటుందో చూడాలి.రోడ్డు ఎంత విస్తరణ అనే అంశంకన్నా పాతమార్కెట్‌లో దుకాణాలు కట్టించి ఇచ్చే అంశం కూడా కార్పొరేషన్ ఇష్టాఇష్టాలపై ఆధారపడింది.

డిఎస్‌సి అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి

- ఇడబ్ల్యుఎస్ అభ్యర్థుల సర్టిఫికెట్లపై ఫిర్యాదులు
- ఒకటి రెండు రోజుల్లో వెబ్ ఆప్షన్లు

ప్రజాశక్తి -ఒంగోలు సిటీ



సర్టిఫికెట్ల పరిశీలనలో అధికారులు

డిఎస్‌సి-2025లో జిల్లాకు కేటాయించిన 629 పోస్టులకు సంబంధించిన అభ్యర్థుల సర్టిఫికెట్లు దశలవారీ పరిశీలన గురువారంతో ముగిసింది. సెలక్టడ్ జాబితా ప్రకారం ఆగస్టు చివరివారంలో రెండు రోజుల పాటు అభ్యర్థులుతో ఒరిజినల్ పత్రాలను పరిశీలించారు. కుల ధ్రువీకరణ,అర్హతలు, ఇడబ్ల్యుఎస్ అభ్యర్థుల విషయంలో వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో 13 టీములు రెండు వారాల నుంచి దశల వారీగా ఎనిమిది విడతలుగా సర్టిఫికెట్లను పరిశీలించారు. తాజాగా ఎంపికైన ఆరుగురు అభ్యర్థులపై జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణకు విద్యార్థి సంఘ నేతలు ఫిర్యాదు చేశారు. దీంతో బుధవారం నుంచి మరో రెండు దపాలుగా ఇడబ్ల్యుఎస్ కోటాలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల సర్టిఫికెట్లను జిల్లా విద్యా శాకాధికారి కిరణ్ కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ వరప్రసాద్ ఆధ్వర్యంలో బృందాలు పరిశీలించారు.

ఫిర్యాదులపై సమగ్ర పరిశీలన.....

ఇడబ్ల్యుఎస్ అభ్యర్థులపై వచ్చిన ఫిర్యాదులో చిట్యాల శ్రీనివాస రెడ్డి డిఎస్‌సి సెలక్టడ్ జాబితాలోనే లేడని అధికారులు తేల్చారు. ఆరోపణకు గురైన మరో అభ్యర్థి మండ్ల ప్రసాద్ బీసీ ఎ కేటగరికి చెందిన అభ్యర్థిగా ధ్రువీకరించారు. ఆ వ్యక్తి బీసీ ఏ కోటాలో ఎంపికైనట్లు అధికారులు తేల్చారు. ఆవుల ఏడుకొండలు ఇడబ్ల్యుఎస్ కోటాలో దరఖాస్తు చేసుకున్నట్లుగా గుర్తించారు. చిలకా నాగశ్రుతికి వివాహం కానందున తండ్రి పేరుతో ఇడబ్ల్యుఎస్ సర్టిఫికెట్ జత చేసినట్లుగా తేల్చారు. ఎం సరస్వతి, దామిరెడ్డి శిల్పకు వివాహం అయినందున భర్తల పేరుతో ఇడబ్ల్యుఎస్ సర్టిఫికెటుల జత చేసిన (తహశీల్దారు ఇచ్చిన)సర్టిఫికెట్లు ఆన్ లైన్ ద్వారా రెక్టీపై చేసినట్లు అధికారులు ప్రకటించారు.

ఇడబ్ల్యుఎస్ కోటాలో 149 మంది....

జిల్లాకు మంజూరైన 629 ఉపాధ్యాయ పోస్టుల్లో 149 మంది ఇడబ్ల్యుఎస్ కోటాలో ఎంపికయినట్లు అధికారులు ధ్రువీకరించారు. వీరిలో 75 మంది పురుషులు, 74 మంది మహిళా అభ్యర్థులు ఉన్నారు. ఎంపికైన ఉపాధ్యాయ పోస్టులకు ఒకటి, రెండు రోజుల్లో వెబ్ ఆప్షన్లు పెట్టుకునే అవకాశం ఇస్తారని సమాచారం. ఈ విద్యా సంవత్సరం ప్రారంభంలో జరిగిన ప్రమోషన్లు, బదిలీలు ప్రక్రియ అనంతరం జిల్లాలో ఏర్పడిన ఖాళీల జాబితా విద్యా శాఖ కమిషనరేట్ కు పంపింది. ఆ జాబితా ప్రకారం ఇస్తారా, లేక ప్రత్యేక జాబితా రూపొందిస్తారా అనేది తెలియాల్సి ఉంది. సర్టిఫికెట్ల పరిశీలనలో డిప్యూటీ డిఇఒ చంద్ర మౌళేశ్వరరావు, డిసిఇబి సెక్రటరీ శ్రీనివాసరావు, ఎంఇఒలు కిషోర్ బాబు,శివాజీ, బాలాజీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రతీప్ కొత్తపల్లి

సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, అంబేద్కర్ గురుకుల పాఠశాల మరియు మలినేని సుశీలమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు సైబర్ క్రైమ్ సెక్యూరిటీ కౌన్సిల్ ప్రదీప్ కొత్తపల్లి ఆధ్వర్యంలో సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదీప్ మాట్లాడుతూ విద్యార్థులు సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వాట్సప్, పేస్‌బుక్‌ల్లో వచ్చే రుణాలు యాపులపై నమ్మకం పెట్టుకోవద్దన్నారు. ఆ యాప్‌లు ఓపెన్ చేయడం ద్వారా బ్యాంకు ఖాతాలోని డబ్బులు మొత్తం పోతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ బి.మహేంద్ర, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సౌజన్య పాల్గొన్నారు.


నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-చీరాల

ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ చీరాల రెవెన్యూ డివిజన్ యూనిట్ ఎన్నికలు గురువారం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు సురేష్ ఆధ్వర్యంలో ఎన్నికలకు నిర్వహించారు. ఎస్. శివరామకష్ణ, బి. ఓంకార్ ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. అధ్యక్షుడిగా కె. గోపి కృష్ణ, సహాధ్యక్షుడిగా వివి. సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షులుగా రాఘవరావు, శివశ్రీను, నారాయణమ్మ, సెక్రటరీగా సురేష్ బాబు,జాయింట్ సెక్రటరీలుగా భాగ్యరాజు, రమేష్, కష్ణతేజ, కోశాధికారి వి. శ్రీనివాసులు, ఇసి మెంబర్లుగా కె. సుజాత, ఎం. జగదీష్, ఎస్. నిస్సి దీవెన, డీసీ కౌన్సిల్ మెంబర్లుగా పి. ఆదినారాయణ, చి. సాయిరాం ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సురేష్ బాబు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ సత్యనారాయణ, జిల్లా స్పోర్ట్స్ సెక్రటరీ డి. అర్జున్, జిల్లా కమిటీ సభ్యుడు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి ఘన నివాళి

ప్రజాశక్తి- మద్దిపాడు



మాట్లాడుతున్న కాలం సుబ్బారావు

మద్దిపాడులోని నటరాజ కళా కేంద్రంలో సీతారాం ఏచూరి ప్రథమ వర్థంతి సభ గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఎం మండల కార్యదర్శి ఉబ్బా ఆదిలక్ష్మి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకుడు కాలం సుబ్బారావు మాట్లాడుతూ సీతారాం ఏచూరి విద్యార్థి దశ నుంచే ఉద్యమాల్లో పనిచేసినట్లు తెలిపారు. అంతర్జాతీయ రాజకీయాలకు ఎదిగినట్లు తెలిపారు. పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా పోరాటం చేసిన వ్యక్తి ఏచూరి అని కొనియాడారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటమే ఏచూరి ఇచ్చే ఘనమైన నివాళి అని తెలిపారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ పాటు పడాలన్నారు. తొలుత ఏచూరి చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కనపర్తి సుబ్బారావు, ఉబ్బా వెంకటేశ్వర్లు, అనంతలక్ష్మి, కాసిం, కాకుమాను సుబ్బారావు, విశ్రాంత ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు యలమంద, నరసింహారావు, వెంకటేశ్వర్లు, కలాం తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమ బోర్డును కొనసాగించాలి

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును కొనసాగించాలని కోరుతూ ఈనెల 15న చలో విజయవాడ కమిషనర్ కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు భవన నిర్మాణ కార్మికుల యూనియన్ (సిఐటియు) జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎన్.రామారావు, అమర్ తెలిపారు. చలో విజయవాడ కమిషనర్ కార్యాలయం ముట్టడి కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఉప్పుగుండూరులో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం తెచ్చిన 12,14 మోమో ను రద్దుచేసి కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు గత ప్రభుత్వం దారి మళ్లించిన రూ.2,500 కోట్ల నగదును బోర్డుకు జమ చేయాలన్నారు. పెండింగ్‌లో క్లెయిమ్స్‌ను వెంటనే పరిష్కరించాలన్నారు. 50 సంవత్సరాల నిండిన కార్మికులకు రూ.5000 పింఛను ఇవ్వాలన్నారు. గృహ నిర్మాణానికి రూ. 5 లక్షలు మంజూర చేయాలన్నారు. పెళ్లి కానుకగా రూ.లక్ష రూపాయలు ఇవ్వాలన్నారు. కాన్పుపుకు రూ. 50 వేలు ఇవ్వాలన్నారు. సహజ మరణానికి రూ. రెండు లక్షలు, ప్రమాదంలో మరణించిన కార్మికుడి రూ.10 లక్షల ఆర్థిక సాయం అందజేయాలన్నారు. పై సమస్యలు పరిష్కారం కోసం నిర్వహిస్తున్న కమిషనర్ కార్యాలయం ముట్టడిలో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

బూత్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గౌతమ్ అశోక్ నియామకం

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ



వైవి.గౌతమ్ అశోక్

ఒంగోలు నగరానికి చెందిన వైవి.గౌతమ్ అశోక్‌ను వైసిపి రాష్ట్ర బూత్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ ఆ పార్టీ రాష్ట్ర బూత్ కమిటీ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. ఈ సందర్భంగా గౌతమ్ అశోక్ మాట్లాడుతూ తనకు పదవి వచ్చేందుకు సహకరించిన రాజ్యసభ సభ్యులు వైవి. సుబ్బారెడ్డి , కనుమూరి నాగేశ్వరరావు జడ్‌పి చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైసిపి ఒంగోలు పార్లమెంట్ సమన్వయకర్త చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి , జిల్లా పర్యవేక్షకులు బత్తుల బ్రహ్మానంద రెడ్డికి కతజ్ఞతలు తెలిపారు. తనను పార్టీలో చేర్చుకుని అవకాశాన్ని కల్పించిన వైసిపి జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, వైసిపి ఒంగోలు నియోజకవర్గ సమన్వయకర్త చుండూరు రవిబాబు , మాజీ మున్సిపల్ చైర్మన్ బాపట్ల హనుమంతరావుకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

బాలికల భవితకు కృషి చేయాలి

ప్రజాశక్తి-పొన్నలూరు

కిశోర బాలికల భవితకు అందరూ కృషి చేయాలని బాలల రక్షణ అధికారి శ్రీలక్ష్మి తెలిపారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో కిషోర బాలికా వికాసంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ బి.సుశీల దేవి మాట్లాడుతూ బాల్య వివాహాలను నివారించడానికి బాలికల సాధికారత కోసం ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. బాలికలకు వ్యక్తిగత శుభ్రత, పౌష్టికాహారం రక్తహీనత, ఆరోగ్యకరమైన జీవనశైలి, రక్షణ చట్టాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. చిన్న వయసులోనే వివాహాలు చేసుకోవడం వల్ల కలిగే శారీరక మానసిక సమస్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విక్టోరియా ,ఎంఎస్‌కెలు ,అంగన్‌వాడీలు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.